RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 30 జనవరి 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:202

# 80 లక్షల మంది దర్శనం

## సమ్మక్క గద్దె సమయానికి కోటికి మించే అవకాశం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




మేడారం సమ్మక్క--సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మాట్లాడిన మంత్రి మాట్లాడుతూ, ఈరోజు దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు.

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

మేడారం శాశ్వత అభివృద్ధికి 70 ఎకరాల విస్తరణ

మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు.బాసర--భద్రాచలం టెంపుల్ సర్క్యూట్

దక్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యతను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు.

జంపన్న వాగు అభివృద్ధి ప్రణాళిక

జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్ప--లక్నవరం--జంపన్న వాగు వరకు పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు.

మేడారానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం

మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

దుష్ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి

సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో అత్యంత తక్కువ సమయంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

గతంలో ఇరుకైన రోడ్ల కారణంగా ఇబ్బందులు ఉండేవని, ఈసారి ఫోర్-లేన్ రోడ్లతో రాకపోకలు చాలా సులభమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత తాగునీటి వ్యవస్థతో పాటు భారీ సంఖ్యలో శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా చెట్ల పెంపకం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.

జాతర విజయవంతానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికార యంత్రాంగం మరియు మీడియా మిత్రులకు సీతక్క అభినందనలు తెలిపారు.

శనివారం వనప్రవేశం

శనివారం సాయంత్రం 4 గంటలకు తల్లులు గద్దెల నుంచి తిరిగి వనప్రవేశం చేయనున్నారని, అప్పటివరకు భక్తులు ఓపికతో దర్శనాలు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు..

# రేపు విచారణకు రాలేనంటూ సిట్‌కు కేసీఆర్ రిప్లయ్

నోటీసుల నేపథ్యంలో సిట్‌కు ప్రత్యుత్తరం రాసిన కేసీఆర్

రేపు మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు చివరి రోజు అన్న కేసీఆర్

ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తానని వెల్లడి



ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు విచారణకు రావాలని తనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఈ మేరకు సిట్‌కు ఆయన సమాధానం ఇచ్చారు. తాను రేపు విచారణకు రాలేనని, శుక్రవారమే మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ అని అందులో ప్రస్తావించారు. అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉందని తెలిపారు. విచారణకు మరో రోజు కేటాయించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా తాను విచారణకు సహకరిస్తానని పేర్కొన్నారు.

అలాగే తనను ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లోనే విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. 160 సీఆర్పీసీ కింద విచారణను ఒకే ప్రాంతంలో చేయాలనే నిబంధనలు ఏమీలేవని గుర్తు చేశారు. భవిష్యత్తులో నోటీసులను ఎర్రవల్లికే పంపించాలని ఆ లేఖలో కోరారు.

# మేడారం లో బైక్‌పై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి!



మేడారం సాక్షిగా... అట్టహాసాల హంగులు లేవు.. కాన్వాయ్‌ల ఆర్భాటాలు లేవు.. జనం మధ్యకు వెళ్లాలనే తపన.. భక్తుల కష్టాలు స్వయంగా చూడాలనే సంకల్పం! అదే తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి మేడారం పర్యటన. గురువారం తెల్లవారు ఝాము నుంచి కార్యక్షేత్రంలోకి దిగి అందరినీ ఆశ్చర్య పరిచారు.

మొన్నటి వరకు మేడారం అభివృద్ధి పనులను పర్యవేక్షించిన ఆయన ఇప్పుడు మేడారం జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దగ్గరుండి మరీ పర్యవేక్షించారు.

గత రాత్రి గద్దె చేరిన పెద్దమ్మలను సతీసమేతంగా దర్శనం చేసుకున్న పొంగులేటి తెల్లారేసరికల్లా ఓ సేవా కార్యకర్తలా కదనరంగంలోకి దూకారు.

కలెక్టర్‌తో కలిసి బైక్‌పై పయనం

వనదేవతలు కొలువైన మేడారంలో సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించేందుకు మంత్రి సరికొత్త పంథాను ఎంచుకున్నారు. కారు దిగి బైక్ ఎక్కారు. జిల్లా కలెక్టర్ టి.ఎస్.దివాకర్‌ను తన వెనుక కూర్చోబెట్టుకుని, స్వయంగా బైక్ నడుపుతూ గల్లీ గల్లీని చుట్టేశారు. ప్రోటోకాల్ గోడలు బద్దలు కొట్టి, సామాన్యుడిలా భక్తుల చెంతకు చేరారు.జంపన్న వాగు వద్ద భక్తులకు అందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో అడిగి



తెలుసుకున్నారు. ఈపర్యటనలో సహచర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

టీ ముచ్చట: ప్రజా గొంతుక కోసం.. టీ కొట్టు వద్ద ఆగారు.హడావిడి పర్యటన కాదిది.. ఒక టీ కొట్టు వద్ద ఆగి, చాయ్ తాగుతూ అక్కడున్న భక్తులతో ముచ్చటించారు. ఛాయ్ వాలాతో చమత్కరించారు. "ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? సౌకర్యాలు ఎలా ఉన్నాయి?" అంటూ ఆరా తీశారు.అంతేగాకఏ ఒక్క భక్తుడికి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో అధికారులకు అక్కడికక్కడే దిశానిర్దేశం చేశారు.

## జరిగిన వాస్తవాలు తెలుసుకోటానికి సిట్ ఎవరికి ఐన నోటీస్ లు ఇవ్వొచ్చు

### మహేష్ కుమార్ గౌడ్



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** కేసీఆర్ అంటే ఉద్యమ నాయకుడు గా మాకు గౌరవం ఉంది

ఫోన్ ట్యాపింగ్ విషయం లో ఎవరు భాగస్వామ్యులు తెలలిసింది ఉంది

నోటీస్ లు ఇస్తారు అంటున్నారు.. నాకు దానిపై క్లారిటీ లేదు

ఫోన్ ట్యాపింగ్ విజయం లో పారదర్శక విచారణ జరగాలి

500 పైన నంబర్ లో ఫోన్ టాప్ అయ్యాయి అనే సమాచారం ఉంది

జరిగిన వాస్తవాలు తెలుసుకోటానికి సిట్ ఎవరికి ఐన నోటీస్ లు ఇవ్వొచ్చు

ఆనాడు ముఖ్యమంత్రి , మంత్రుల ప్రమేయం లేకుండా ఇలాంటివి జరగవు

అధికారులు మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడరు

సిట్ సంపూర్ణ విచారణ జరిగితేనే తెలుస్తుంది నిజాలు బయటికి వస్తాయి

ఈ విషయం లో వాస్తవాలు బయటికి రవళి అని ప్రజలు కోరుకుంటున్నారు

కెసిఆర్ కి నోటీస్ లు ఇవ్వటం పై రాజకీయ దురుద్దేశం లేదు

మున్సిపాలిటీ లో మెజారిటీ స్థానాల్లో గెలుస్తాం

మున్సిపాలిటీ లకోసం డైవర్షన్ పాలిటిక్స్ చెయ్యాల్సిన అవసరం లేదు

ఇంచార్జ్ మంత్రులు కి బి ఫార్మ్ విషయం లో పూర్తి స్వేచ్ఛ ఉంది

# గాంధీ భవన్ లో నిజమాబాద్ పార్లమెంట్ మునిసిపల్ ఎన్నికల సమీక్ష,



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహకాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ , రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని లక్ష్యంగా చేసుకుని తీసుకోవాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ , సుదర్శన్ రెడ్డి , ఎమ్మెల్యే భూపతి రెడ్డి , ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ , డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి , రామకృష్ణ , మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్ , కేశ వేణు సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని చూరగోనేలా పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు.

# ప్రజాబలం

30 జనవరి 2026 శుక్రవారం


## ధనవంతుల ఆస్తిగా బంగారం మారుతుందా

పెరుగుతున్న బంగారం ధరలు సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తున్నాయ్. బంగారం సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయి ధనవంతుల ఆస్తిగా మారే సమయం వస్తుందని ఋషి బ్రహ్మంగారు సంవత్సరాల క్రితం అంచనా వేశారన్నది సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మాట. బంగారం ధరల ఈ పెరుగుదల ఇంకా ఎంతకాలం కొనసాగుతుంది? ఈ పెరుగుదల వెనకున్న కారణాలేంటి ? ప్రస్తుతం బంగారంలో పెట్టుబడి పెట్టడం సురక్షితమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.బంగారం ధరలు సామాన్యులకు అందనంతగా పెరుగుతున్నాయని బ్రహ్మంగారు చాలా కాలం క్రితమే అంచనా వేశారు.భారతీయ సమాజానికి బంగారం కేవలం ఒక లోహం మాత్రమే కాదు ఇది సంప్రదాయం, విశ్వాసం , శుభంతో కూడా ముడిపడి ఉంది. " బంగారం ఎప్పుడూ దుమ్ముగా మారదు " అని ఒక సామెత ఉంది. అందుకే ప్రజలు బంగారాన్ని కేవలం ఆభరణాలుగా లేదా లోహంగా మాత్రమే కాకుండా పెట్టుబడిగా మన్నికైన ఆస్తిగా కూడా చూస్తారు. శతాబ్దాలుగా బంగారాన్ని సాంప్రదాయ ఆర్థిక వస్తువుగా పరిగణిస్తున్నారు. భారతీయ సంప్రదాయం, హిందూ సంస్కృతిలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. మంగళసూత్రాలు, గాజులు ధరించడం భారతీయ వివాహిత మహిళల విశ్వాసం. ఇటీవల బంగారం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.బంగారం మెరుపు ఎప్పుడూ వార్తల్లో ఉంటుంది, కానీ ఈ రోజుల్లో, దాని ధరలు నిరంతరం పెరుగుతుండటం చర్చనీయాంశంగా మారుతోంది. బంగారం ధరలు ప్రతిరోజూ కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. కానీ బంగారం సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయి ధనవంతుల సొత్తుగా మారే సమయం వస్తుందని బ్రహ్మంగారు సంవత్సరాల క్రితం అంచనా వేశారట. ప్రస్తుత బంగారం ధరను చూస్తే, బ్రహ్మంగారు మాటలు ఇప్పుడు చాలావరకు నిజమయ్యాయనే చెప్పుకోవాలేమోచాలా సంవత్సరాల క్రితం కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దక్షిణ భారతదేశానికి గొప్ప జ్ఞాని , దార్శనికుడిగా భావిస్తారు. బంగారం ధరతో సహా ఆయన అంచనాలు చాలా క్రమంగా నిజమవుతున్నాయి. బంగారం ధర చాలా పెరుగుతుందని, మహిళలు బంగారానికి బదులుగా ఇతర, చౌకైన పదార్థాలతో తయారు చేసిన నగలను ధరించడం ప్రారంభిస్తారని బ్రహ్మంగారు ముందే అంచనావేశారు. అప్పట్లో ఇది సాధ్యమయ్యేపనేనా? ఇదొక ఊహ మాత్రమే అనిపించినా ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే అలానే ఉంది. బంగారం కొనుగోళ్లు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. పెరుగుతున్న బంగారం ధరలు ఇప్పుడు వివాహాలు, పండుగలు , సాంప్రదాయ షాపింగ్‌పై ప్రభావం చూపుతున్నాయి. ద్రవ్యోల్బణం కారణంగా, ప్రజలు ఇప్పుడు తక్కువ బరువు లేదా ఇతర లోహాలతో తయారు చేసిన ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. బంగారం ధర పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం, 24 క్యారెట్ల బంగారం ధర ?1,62,100, 22 క్యారెట్ల బంగారం ధర ?1,48,600, 18 క్యారెట్ల బంగారం ధర ?1,21,610. నగరం , రోజును బట్టి ధరల్లో చిన్న చిన్న మార్పులుంటాయపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలో భవిష్యత్ గురించి చాలా అంశాలు పద్యాలు, వచనాల రూపంలో చెప్పారు. అయితే బంగారం గురించి నేరుగా, స్పష్టంగా ధరలు పెరగడం గురించి ప్రత్యేకంగా లేదనే వాదనలు ఉన్నాయి. వాస్తవానికి బంగారం, ధరలుఅమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ విధానాలు స్టాక్ మార్కెట్‌లో అనేక ఒడిదొడుకులకు కారణమయ్యాయి. ఫలితంగా, పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి లోహాలపై పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గుచూపుతున్నారు.వెనెజ్వెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధం తర్వాత బంగారం ధరలు పెరిగాయి. అలాగే, ఇరాన్ నిరసనకారులను హింసాత్మకంగా అణచివేస్తున్నారంటూ ట్రంప్ ఆ దేశ ప్రభుత్వంపై బెదిరింపులకు దిగారు. గ్రీన్‌లాండ్ స్వాధీనం గురించి కూడా ప్రస్తావించారు.సుంకాలు విధిస్తామంటూ యూరోపియన్ యూనియన్ దేశాలపై కూడా ఆయన బెదిరింపులకు దిగారు. వైట్‌హౌస్ నుంచి కొనసాగుతున్న ఈ అనిశ్చితి మార్కెట్లను భయాందోళనకు గురిచేస్తోంది.చైనాతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేస్తే 100 శాతం సుంకాలు విధిస్తామంటూ గత శనివారం డోనల్డ్ ట్రంప్ కెనడాను హెచ్చరించారు. అయితే, తమకు అలాంటి ఉద్దేశం లేదని కెనడా ఆ తర్వాత పేర్కొంది.ఇవన్నీ పెట్టుబడిదారులను భయాందోళనకు గురిచేశాయి. ప్రపంచంలో ఏవైనా యుద్ధాలు, దురాక్రమణ, రాజకీయంగా భారీ ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ప్రజలు తమ డబ్బును స్టాక్ మార్కెట్ లేదా అలాంటి ఇతర ప్రమాదకరమైన ఆస్తుల నుంచి వెనక్కుతీసుకుని.. బంగారం వంటి సంప్రదాయ, సురక్షిత ఆస్తులవైపు మళ్లించేందుకు మొగ్గుచూపుతారు.ఈ అనిశ్చితి, ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గుచూపారు. ఈ మొగ్గు బంగారం డిమాండ్‌ను పెంచడంతో పాటు ధరలు వేగంగా పెరగడానికి కారణమైంది.అలాగే, 2025లో ట్రంప్ చాలా దేశాలపై సుంకాలు విధించిన సమయంలోనూ పెట్టుబడిదారులు "సురక్షిత పెట్టుబడులకు" మళ్లారు. ఫైనాన్షియల్ మార్కెట్లు నష్టాల బాటపట్టినా కూడా తమ పెట్టుబడుల విలువ తగ్గకుండా నిలుపుకునే ఆస్తులను "సురక్షిత పెట్టుబడులు" (సేఫ్ హెవెన్స్)గా వ్యవహరిస్తారు. క్లిష్టతర పరిస్థితుల్లోనూ వీటి విలువ పెరుగుతుంటుంది.సాధారణంగా, అమెరికన్ డాలర్ బలహీనపడితే.. బంగారం ధరలు పెరుగుతాయి.ఎందుకంటే, బంగారం క్రయవిక్రయాలు డాలర్లలో జరుగుతాయి. డాలర్ బలహీనపడితే, ఇతర దేశాల్లో బంగారం ధరలు తగ్గుతాయి. కాబట్టి, కొనుగోళ్లు పెరుగుతాయి. ఇది డిమాండ్‌ను పెంచడంతో పాటు ధరలనూ పెంచుతుంది.ద్రవ్యోల్బణం, లేదా ఆర్థిక అనిశ్చితి కారణంగా డాలర్ బలహీనపడుతుంటుంది. అలాంటి సమయాల్లో, ప్రజలు బంగారాన్ని సురక్షిత మార్గంగా భావిస్తారు.వాటికితోడు.. బలహీనమైన డాలర్, అమెరికాలోని తక్కువ వడ్డీరేట్లతో కలిపి బంగారంపై పెట్టుబడులు పెట్టడం తక్కువ రిస్క్ కలిగిస్తుంది. డాలర్ నుంచి దూరం జరగడమే బంగారం ధర పెరుగుదలకు దారితీసినట్లు అనలిస్టులు భావిస్తున్నారు.యెన్(జపాన్ కరెన్సీ)ను బలపరచడంలో అమెరికా, జపాన్ ప్రయత్నాలతో డాలర్ బలహీనపడింది.

# పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఇంఛార్జి మీనాక్షి తో బీసీ జేఏసీ నేతల భేటీ

**మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా పద్ధతిలో టికెట్లు ఇవ్వాలి**

**రాహుల్ గాంధీ మాటకు రాష్ట్రంలో విలువలేద ?**

**బీసీలకు 56% బి ఫామ్ లు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ తమ చిత్తశుద్ధినీ నిరూపించుకోవాలి**

**చట్టబద్ధంగా బీసీ రిజర్వేషన్ ఇవ్వకపోతే పార్టీ పరంగా ఇస్తామన్న హామీనైన నిలబెట్టుకోండి**

**జనరల్ స్థానాల్లో కూడా బీసీలకు అవకాశం కల్పించాలి**

**బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి**





హైద్రాబాద్ జనవరి 29 ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం 56 శాతం టికెట్లు కేటాయించాలని, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉండాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు

గురువారం హైదరాబాదులోని గాంధీభవన్ లో పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి లేఖ నటరాజన్ తో బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బీసీ ప్రత్యందుల బృందం వారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మహేష్ కుమార్ గౌడ్ మీనాక్షి నటరాజన్ లకు అందజేశారు .

ముందుగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మాట ఇచ్చి ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నారని, చట్టపరంగా 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించకపోతే పార్టీ పరంగా ఖచ్చితంగా కల్పిస్తామని పదేపదే వెల్లడించి ఇప్పుడు తీరా గతంలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల అప్పుడు గాని ఇప్పుడు జరిగే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గాని పార్టీ పరంగా బీసీల జనాభా దామషా ప్రకారం 56% శాతం టికెట్ల ఇవ్వడం మరిచిపోయారని, పార్టీ గుర్తులతో జరిగే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే 56% బి పామ్ లు బీసీలకు ఇవ్వాలని, మున్సిపల్ చైర్మన్ లలో కూడా 68 మున్సిపల్ చైర్మన్ లుగా బీసీలకు అవకాశం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు .ప్రస్తుతం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనందున తక్షణమే రాహుల్ గాంధీ మాట రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కి శిలాశాసనం అయినట్లయితే రాహుల్ గాంధీ నినాదం, విధానమైన ఎవరి జనాభా ఎంత ఉందో వారికి అంతే వాటా దక్కాలని అన్న సూత్రాన్ని కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని ఆయన కోరారు

పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ లు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల కంటే బీసీలకు మున్సిపల్ ఎన్నికల్లో 32 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయని, అయినప్పటికీ బీసీలకు రాజకీయ అవకాశాలు పెంచడానికి పార్టీ పరంగా అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నామని పార్టీలో అందరితో చర్చించి బీసీల కు రాజకీయంగా న్యాయం జరిగే విధంగా నిర్ణయం తీసుకుంటామా వారు ఇచ్చారు

ఈ బేటిలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కో చైర్మన్ వీరస్వామి, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రం గౌడ్, డాక్టర్ రమేష్, మాదేశి రాజేందర్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, సోమాచారి, తదితరులు పాల్గొన్నారు

# వరంగల్ మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి భూసేకరణ పూర్తి

## భారత విమానాశ్రయాల అథారిటీకి భూముల అధికారిక అప్పగింత






వరంగల్ మామునూరు విమానాశ్రయ అభివృద్ధి కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది. సేకరించిన భూములను నేడు బేగంపేట్ విమానాశ్రయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి రామ్ మోహన్ నాయుడుకు అధికారికంగా అప్పగించారు.

ఈ భూముల అప్పగింత కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ బండా ప్రకాష్, ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ విమానయాన విభాగం డైరెక్టర్ భారత్ రెడ్డి హాజరయ్యారు. అలాగే రవాణా, రోడ్లు ౘ భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రోడ్లు ౘ భవనాలు మరియు రవాణా శాఖల సీనియర్ అధికారులు, భారత విమానాశ్రయాల అథారిటీ అధికారులు కూడా పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు మాట్లాడుతూ,** దేశంలో ప్రాంతీయ వైమానిక అనుసంధానాన్ని విస్తృతంగా పెంచుతూ సామాన్య ప్రజలకు విమాన ప్రయాణాన్ని సులభతరం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మామునూరు విమానాశ్రయాన్ని త్వరితగతిన కార్యాచరణలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. భూసేకరణను సమయపాలనతో, సమర్థవంతంగా పూర్తి చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు.

భూముల అప్పగింత అనంతరం మామునూరు విమానాశ్రయ అభివృద్ధి వ్యయం మొత్తాన్ని భారత విమానాశ్రయాల అథారిటీ భరిస్తుందని తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్టులో 2,500 మీటర్ల రన్‌వే, టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ATC) టవర్, అగ్నిమాపక మరియు భద్రతా సదుపాయాలు, అనుబంధ మౌలిక వసతుల నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి 2 నుండి 2.5 సంవత్సరాలలో విమానాశ్రయాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

మామునూరు విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని కాకతీయుల శిల్పకళా, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపకల్పన చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ఇది కేవలం రవాణా సదుపాయంగా కాకుండా, ప్రాంతీయ గుర్తింపును ప్రతిబింబించే ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. శంషాబాద్ విమానాశ్రయాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ఒక విమానాశ్రయం ఎలా ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు మరియు పట్టణాభివృద్ధికి దోహదపడుతుందో వివరించారు. అదే విధంగా మామునూరు విమానాశ్రయం వరంగల్‌తో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంత అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తుందని అన్నారు.

**ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ,** మామునూరు విమానాశ్రయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తు చేశారు. నిజాం పాలన కాలంలో 1930లో నిర్మితమైన ఈ విమానాశ్రయం స్వాతంత్ర్యానికి ముందు దక్షిణ భారతదేశంలో అతిపెద్ద విమానాశ్రయంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఒకప్పుడు ప్రధాన వైమానిక కేంద్రంగా ఉన్న మామునూరు విమానాశ్రయాన్ని పునరుద్ధరించడం ద్వారా వరంగల్ చారిత్రక ప్రాధాన్యతను తిరిగి తీసుకురావడంతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. భూసేకరణను పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయడం రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని అన్నారు.

**మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ,** వరంగల్ (మామునూరు) విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి భూసేకరణతో పాటు అవసరమైన అన్ని అనుమతుల ప్రక్రియ పూర్తిచేసి, వాటి క్లియరెన్స్ సర్టిఫికెట్లను కేంద్ర పౌర విమానయాన శాఖకు అందజేయడం గర్వకారణమని తెలిపారు. దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురైన ఈ చారిత్రక విమానాశ్రయానికి, ప్రస్తుత ముఖ్యమంత్రి వరంగల్‌ను అభివృద్ధి కేంద్రంగా, రెండవ రాజధానిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రాధాన్యం కల్పించారని పేర్కొన్నారు. రైతులను ఒప్పించి, వారికి న్యాయం చేస్తూ భూసేకరణ పూర్తిచేయడం రాష్ట్ర ప్రభుత్వ సమిష్టి కృషి ఫలితమని అన్నారు. ఈ విమానాశ్రయం ద్వారా పరిశ్రమలు, టెక్స్టైల్ పార్కులు, కార్గో రవాణా, పర్యాటకం విస్తరించి వరంగల్--కరీంనగర్, వరంగల్--ఖమ్మం, వరంగల్--హైదరాబాద్ కారిడార్ల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,** వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రానికి ప్రస్తుతం ఒక్కటే విమానాశ్రయం ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ విమానాశ్రయాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకొని ముందుకు తీసుకెళ్లినందుకు కేంద్ర పౌర విమానయాన శాఖకు రాష్ట్ర ప్రభుత్వ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు, రైతుల సహకారంతో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వరంగల్ ప్రజల కలను నెరవేర్చడంలో కీలక ముందడుగు పడిందన్నారు. ఇదే విధంగా కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలు ఇప్పటికే సమర్పించామని, కేంద్రం నుంచి సాధ్యాసాధ్యత అనుమతులు లభించిన వెంటనే భూసేకరణ పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం భూమిని అప్పగిస్తుందని స్పష్టం చేశారు.మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ మరియు అభివృద్ధి ద్వారా ఉత్తర తెలంగాణలో వైమానిక అనుసంధానం బలోపేతం కావడంతో పాటు వాణిజ్యం, పర్యాటకం మరియు సమగ్ర సామాజిక--ఆర్థిక అభివృద్ధికి గణనీయమైన దోహదం చేకూరనుంది. రాష్ట్రంలోని ఒక చారిత్రక వైమానిక వారసత్వ కేంద్రం తిరిగి పునరుజ్జీవనం పొందనుంది.

# పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుంది**

**నివాస ప్రాంతాల్లోని పరిశ్రమలతో భద్రత, ఆరోగ్య ప్రమాదాలు**

**గాలి నాణ్యత పర్యవేక్షణకు రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశాం**

**త్వరలో గాలి నాణ్యత డాష్ బోర్డులను ప్రారంభిస్తాం**

**కాలుష్య ఫిర్యాదులపై వేగంగా స్పందించేందుకు ప్రత్యేక బృందాలు**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అందుకే ఈ విషయంలో

తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుందనీ హైదరాబాద్ నగరం తో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి విభాగం (ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీ) లో

“గాలి నాణ్యత సూచీ మరియు గాలి నాణ్యత నిర్వహణ” అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సదస్సు యొక్క స్పష్టమైన, ఉన్నత లక్ష్యం ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం స్వచ్ఛమైన గాలి అన్నారు.

నేడు తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి, హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగింది, ఈ అభివృద్ధి మనకు గర్వకారణం అని తెలిపారు.

అదే సమయంలో ఇది మనపై బాధ్యతను కూడా మోపుతుంది అన్నారు.

అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణను ఎదురెదురుగా నిలబెట్టలేం,

అవి చేతులు కలిపి ముందుకు నడవాలి అని డిప్యూటీ సీఎం అన్నారు.

సుస్థిర అభివృద్ధి ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోందనీ తెలిపారు. అదే సమయంలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలపై కూడా తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందనీ డిప్యూటీ సీఎం తెలిపారు.

ఎందుకంటే

శుభ్రమైన గాలి లేకుండా జరిగే అభివృద్ధి నిజమైన ప్రగతి కాదు,

అది కేవలం ఆలస్యమైన నష్టం మాత్రమే అని వివరించారు.

గాలి నాణ్యత ఒక పర్యావరణ సూచీ మాత్రమే కాదు,

అది ప్రజారోగ్య సూచీ,

అది ఉత్పాదకత సూచీ మరియు

అది ఆర్థిక సూచీ కూడా అన్నారు.

2024 ‘స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్’ సహా ప్రపంచ స్థాయి అధ్యయనాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతున్నాయి అని తెలిపారు.

నేడు గాలి కాలుష్యం, అధిక రక్తపోటు తర్వాత, ప్రపంచంలో మరణాలకు రెండో ప్రధాన కారణంగా మారిందనీ,

ప్రతి ఏడాది 80 లక్షలకు పైగా అకాల మరణాలకు ఇది కారణమవుతోంది అన్నారు.

ఇది మన పిల్లలను, వృద్ధులను, పని చేసే జనాభాను తీవ్రంగా ప్రభావితం చేస్తోందనీ అన్నారు.

ప్రపంచ బ్యాంక్ అధ్యయనం ప్రకారం, గాలి కాలుష్యం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా నాలుగు ట్రిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లుతోంది,

అందుకే శుభ్రమైన గాలి గురించి మాట్లాడినప్పుడు,

మనం మనుషుల జీవితాల గురించి,

ఆర్థిక బలంపై,

సామాజిక శ్రేయస్సు గురించి మాట్లాడుతున్నాం అన్నారు.

హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటిగా ఇప్పటికే గుర్తింపు పొందింది, ఇది మనందరికీ గర్వకారణం,

కానీ అదే సమయంలో మన నగర వ్యవస్థలు కూడా అంతే వేగంగా పరిపక్వం చెందాలి అని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

తెలంగాణ ప్రభుత్వం లక్ష్యాధారితమైన, శాస్త్రీయమైన విధానాన్ని అనుసరిస్తోంది అందులో భాగంగా



మొదటి అంశం పర్యవేక్షణ (Monitoring).

మా నమ్మకం చాలా స్పష్టం:

మనకు కొలవలేని దాన్ని మనం నిర్వహించలేం.

2024లో గాలి నాణ్యత పర్యవేక్షణ నెట్‌వర్క్‌ను రెట్టింపు చేస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశాం. దీని ద్వారా రియల్‌టైమ్, విశ్వసనీయ డేటా అందుతుందని తెలిపారు.

రెండోది --- ప్రణాళిక (Planning).

2025లో రాష్ట్ర గాలి శుభ్రత కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం.

వాహనాలు, రోడ్డు ధూళి, నిర్మాణాలు, పరిశ్రమలు, బహిరంగ దహనం వంటి ప్రధాన కాలుష్య మూలాలను ఈ ప్రణాళిక పరిష్కరిస్తోంది. ఇది ఇప్పటికే అమలులో ఉందనీ తెలిపారు.

మూడోది.

స్వచ్ఛమైన రవాణా (Clean Mobility).

ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీలు అందిస్తున్నాం.

ఈ-బస్సులు, మెట్రో విస్తరణ ద్వారా ప్రజా రవాణాను బలోపేతం చేస్తున్నాం.

రాష్ట్రవ్యాప్తంగా ఛార్జింగ్ మౌలిక వసతులు నిర్మిస్తున్నాం.

పాత, కాలుష్యకర వాహనాలను తొలగించేందుకు రిజిస్టర్డ్ వాహన స్క్రాపింగ్ కేంద్రాలను ప్రారంభించాం అని వివరించారు.

నాలుగోది --- పరిశ్రమల నియంత్రణ.

పరిశ్రమల ఉద్గారాలను నిరంతర పర్యవేక్షణ వ్యవస్థల ద్వారా కాలుష్య నియంత్రణ మండలి సర్వర్లకు అనుసంధానించాం,

శుభ్రమైన ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం,

నియమావళి అమలును కఠినతరం చేస్తున్నాం అని వివరించారు.

ఐదోది --- పునరుత్పాదక శక్తి.

2025 పునరుత్పాదక శక్తి విధానం ద్వారా 2030 నాటికి 20,000 మెగావాట్ల లక్ష్యాన్ని నిర్దేశించాం, సౌర, గాలి, గ్రీన్ హైడ్రజన్ ద్వారా.

ఇది కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

కొత్త ప్రమాదాలను కూడా మనం గుర్తించాలి,

కొన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు సుమారు 32 శాతం కాలుష్యానికి కారణమవుతున్నాయని ప్రజెంటేషన్ వెల్లడించిందనీ తెలిపారు.

నేరుగా వచ్చే ధూళి కణాలపై నియంత్రణ ఉన్నప్పటికీ, వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ వంటి ఇతర కాలుష్యాలపై మరింత దృష్టి సాధించాల్సిన అవసరం ఉంది అన్నారు.

జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం ఉదాహరణగా మనం చూశాం,

ఒకప్పుడు నగర చివరన ఉన్న పరిశ్రమలు నేడు నివాస ప్రాంతాల మధ్య ఉన్నాయి,

ఇలాంటి పరిస్థితులు ా== లోపల అనేక ఇండస్ట్రియల్ ఏరియాల్లో ఉన్నాయి అన్నారు.

ఇది రాష్ట్ర ప్రజల భద్రత, ఆరోగ్య పరంగా తీవ్రమైన ప్రమాదాలను సృష్టిస్తుంది అని పేర్కొన్నారు.

నివాస ప్రాంతంలో జరిగే పరిశ్రమల ప్రమాదం పెద్ద విపత్తుగా మారవచ్చు అన్నారు.

కాబట్టి పరిశ్రమల పునర్వ్యవస్థీకరణ, జోనింగ్ సంస్కరణలు, మెరుగైన భూ వినియోగ ప్రణాళికలను తీవ్రంగా పరిశీలించాలి అన్నారు.



నగర వృద్ధి ప్రణాళికతో జరగాలి,

అదృష్టవశాత్తూ కాదు,

ముందుకు వెళ్లే క్రమంలో పాలన వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తున్నాం,

ప్రజలకు అందుబాటులో ఉండే గాలి నాణ్యత డ్యాష్‌బోర్డును త్వరలో ప్రారంభించాలని భావిస్తున్నాం అని డిప్యూటీ సీఎం ప్రకటించారు.

కాలుష్య ఫిర్యాదులకు వేగంగా స్పందించేందుకు రెండు +ఎవీజ జోన్లలో ప్రత్యేక చర్యల బృందాలను ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తాం, ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఆ కేంద్రాలను విస్తరిస్తాం అన్నారు.

మా ప్రభుత్వ దృష్టికోణం కేవలం నియంత్రణ మాత్రమే కాదు,

అది స్పందనాత్మకం కూడా కానీ నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను ఎంత నిబద్ధత కలిగిన ప్రభుత్వం అయినా, ఒంటరిగా శుభ్రమైన గాలిని అందించలేరు అన్నారు, శుభ్రమైన గాలికి భాగస్వామ్యం అవసరం అన్నారు.

పౌరులతో,

పరిశ్రమలతో,

సంస్థలతో

పౌర సమాజంతో భాగస్వామ్యం తప్పనిసరి అని డిప్యూటీ సీఎం తెలిపారు.

స్వచ్ఛమైన గాలిని ఏర్పాటు చేసుకోవడానికి

రోజువారీ చిన్న నిర్ణయాలు చాలా ముఖ్యం

ప్రజా రవాణా వినియోగించడం,

ఇంధనాన్ని ఆదా చేయడం,

చెత్తను కాల్చకుండా ఉండడం,

పచ్చ విధానాలకు మద్దతు ఇవ్వడం వంటివి విస్తృతంగా చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సూచించారు.

పర్యావరణ పరిరక్షణ ఇంటి నుంచే ప్రారంభమవుతుంది,

మేము శుభ్రమైన గాలిని కేవలం పరిపాలనా బాధ్యతగా చూడటం లేదు,

అది ఒక నైతిక బాధ్యతగా చూస్తున్నాం,

మన పిల్లల పట్ల,

భవిష్యత్ తరాల పట్ల

చరిత్ర పట్ల బాధ్యత గా భావిస్తున్నామని తెలిపారు.

మన తెలంగాణను మనం ఎలా వదిలిపెట్టాలనుకుంటున్నాం?

కాలుష్యంతో నిండిన ఊపిరితిత్తులు ఉన్న సంపన్న రాష్ట్రంగా?

లేదా ఆరోగ్యవంతమైన పౌరులు ఉన్న ఆధునిక రాష్ట్రంగా? అని ప్రశ్నిస్తూనే మా సమాధానం స్పష్టం,ఈ సదస్సు జాతీయ, అంతర్జాతీయ నిపుణులను ఒక వేదికపైకి తీసుకొచ్చింది.వారి అనుభవం, డేటా, ఆవిష్కరణలు మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి అన్నారు.

సంబంధిత శాఖలన్నీ ఈ ఉత్తమ విధానాలను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా అధ్యయనం చేసి అమలు చేయాలని కోరుతున్నాను అని తెలిపారు.

జ్ఞానాన్ని విధానంగా మార్చుదాం,

విధానాన్ని చర్యగా మార్చుదాం,

చర్యను ఫలితంగా మార్చుదాం అని పిలుపునిచ్చారు. ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణలు, శుభ్రమైన గాలి

కలిసి ముందుకు సాగే తెలంగాణను నిర్మిద్దాం, అదే మన నిజమైన వారసత్వం అని డిప్యూటీ సీఎం తెలిపారు.

# దేశ నలుమూలల నుంచితరలివచ్చిన భక్తులతోకిక్కిరిసిన గద్దెలు

**జనసంద్రాన్ని తలపిస్తున్నవనదేవతల ప్రాంగణంఎత్తు బంగారం సమర్పిస్తూ-మొక్కుల సమర్పణ**

**బుధవారం అర్ధరాత్రి గద్దె పైకి చేరుకున్న సారలమ్మ అమ్మవారు, పగిడిద్ద రాజులు, గోవిందరాజులు**

**నేటి సాయంత్రం గద్దె పైకి రానున్న సమ్మక్క అమ్మవారు**

**పుష్కారాలను తలపిస్తున్న జంపన్న వాగు**



మేడారం, జనవరి 29 ములుగు జిల్లాలోని మేడారం భక్తజన జాతరగా మారింది. లక్షలాదిగా తరలివచ్చినభక్తులతో వనదేవతల ప్రాంగణం జనసంద్రాన్ని తలపించింది.తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర,ఏపీ, చత్తీస్గఢ్ రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి ఆదివాసి గిరిజనులు,భక్తులు మేడారానికి తరలివచ్చారు. దీంతోమేడారానికి వచ్చే దారులన్నీ వాహనాలతో రద్దీగా మారాయి. వెంట తెచ్చుకున్న కోళ్లను వనదేవతల గద్దెల సమీపంలో గాల్లోకి ఎగురవేస్తూ భక్తులు సందడి చేస్తున్నారు.కుటుంబాలను చల్లగా దీవించు తల్లీ అంటూ దేవతలను కొలుస్తున్నారు.



ఎత్తు బంగారాలను సమర్పిస్తున్నారు. వచ్చే రెండు రోజులు భారీ సంఖ్యలో భక్తులు మేడారంకు తరలిరానున్నారు. మేడారం వెళ్లే దారి పొడవునా గిరిజన మహిళల నృత్యాలు,దొరల కొమ్ము బూరల శబ్దాలు భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. ఇక్కడి వాతావరణం భక్తులను భక్తి పారవశ్యంలోముంచెత్తుతోంది. విదేశాల నుంచి కూడామానవ శాస్త్ర పరిశోధకులు ఈ అరుదైన గిరిజన సంస్కృతిని అధ్యయనం చేయడానికివిచ్చేస్తున్నారు.ఇప్పటికే సారలమ్మ అమ్మవారు పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి వచ్చారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని గత నెల రోజుల నుంచే భక్తులు మేడారానికి తరలివస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి రూ. 251 కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులను పూర్తి చేసింది. అడవి తల్లుల ఆశీస్సుల కోసం..లక్షలాది మంది భక్తుల రాకతో మేడారం అడవి పులకించిపోతోంది. ఆధునిక కాలంలోనూ ఆదివాసీ సంప్రదాయాలు ఎంత శక్తివంతంగా ఉంటాయో చాటిచెప్పే ఈజాతర, కేవలం ఒక పండుగ మాత్రమేకాదు.. అది కోట్లాది మంది నమ్మకం. మేడారంలో ఎక్కడ చూసినా బెల్లం (బంగారం)..కుప్పలే కనిపిస్తున్నాయి. భక్తులు తమ కోరికలు తీరినందుకు కృతజ్ఞతగా తల్లులకు’బంగారం’ సమర్పించుకుంటున్నారు. గిరిజన ఆచారం ప్రకారం వనదేవతలకు మొక్కులు చెల్లిస్తున్నారు. కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నజంపన్న వాగు ఇప్పుడు భక్తుల స్నానాలతో జన సముద్రాన్ని తలపిస్తోంది. వాగులోస్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయనిభక్తుల ప్రగాఢ విశ్వాసం. జంపన్న వాగు పుష్కరశోభను తలపిస్తున్నది. కాగా గద్దెల వద్ద తొక్కిసలాట జరగకుండా అత్యాధునిక సెన్సార్ల ద్వారా రద్దీని ఎప్పటికప్పుడు అంచనా



వేస్తున్నారు. 50కి పైగా మొబైల్ మెడికల్ యూనిట్లు, ఎమర్జెన్సీ కోసంఎయిర్ అంబులెన్స్ సౌకర్యం సిద్ధంగా ఉన్నాయి. భక్తుల కోసం ప్రత్యేకంగా ‘మేడారం యాప్’ అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా పార్కింగ్ ప్లేసులు, ట్రాఫిక్ అప్డేట్స్ తెలుసుకోవచ్చు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర స్వయంగా జాతర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 42,000 మంది ప్రభుత్వ సిబ్బందిని విధుల్లో ఉన్నారు. భక్తులు ప్రశాంతంగా వనదేవతలను దర్శించుకుంటున్నారు. ప్రభుత్వం చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భక్తుల రద్దీతో విద్యుత్ వెలుగులతో , రాత్రి వేళ అద్భుతమైన దృశ్యంతో మేడారం మెరిసిపోతున్నది. చిన్న చిన్న వాగుల ఒడ్డున, చెట్లకింద వేలాది మంది భక్తులు వంటలు చేసుకుంటూ, చిన్న చిన్న దీపాల వెలుగులో ఆనందంతో కుటుంబ సభ్యులతో సేద తీరుతూ ఈ పర్యటనను మదిలో నిలుపుకుంటున్నారు.

బందు మిత్రులతో కులమతాలకు అతీతంగా అందరూ ఒకే చోట కూర్చుని భోజనం చేయడం ఇక్కడి ప్రత్యేకత. చాలామంది భక్తులు తమ ఇళ్ల నుంచే బియ్యం,పప్పు తెచ్చుకుని, మేడారం చెట్ల కింద ‘వనభోజనాలు’ చేస్తారు. ఇది ఒక గొప్ప పర్యాటక అనుభవాన్ని కూడా ఇస్తుంది. మేడారంఅంటే కేవలం మొక్కులు తీర్చుకోవడం మాత్రమే కాదు, అది తెలంగాణ గిరిజన అస్తిత్వానికి, ధైర్యానికి ప్రతీక. ఆధునిక ప్రపంచంలో మనిషికి, ప్రకృతికి ఉన్న విడదీయరాని బంధాన్ని ఈ జాతర గుర్తు చేస్తుంది.

# పీలా బ్రదర్స్ పొలిటికల్ వార్

విశాఖపట్టణం, జనవరి 29, ఉమ్మడి విశాఖ జిల్లాలో పీలా ఫ్యామిలీ టీడీపీకి నమ్మిన బంటు వంటిది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీనే నమ్ముకుని రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారు. పీలా మహలక్ష్మి నాయుడు దగ్గరి నుంచి టీడీపీ అధిష్టానం కూడా ఆ ఫ్యామిలీకి చాలా ఇంపార్టెన్స్ ఇస్తూ వస్తోంది. విశాఖ జిల్లాలో గవర సామాజికవర్గం నుంచి అత్యంత బలమైన నాయకత్వంగా ఉన్నారు పీలా ఫ్యామిలీ. మహలక్ష్మి నాయుడు తర్వాత ఆయన కుమారులు రాజకీయాల్లోకి వచ్చారు. వ్యాపార వ్యవహారాలు సాగిస్తూ పాలిటిక్స్‌లో యాక్టీవ్‌గా ఉంటున్నారు. పీలా శ్రీనివాసరావు ప్రస్తుతం గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ మేయర్‌గా ఉన్నారు. పీలా గోవింద్ అనకాపల్లి ఎమ్మెల్యేగా గతంలో పని చేసి ప్రస్తుతం అర్బన్ ఫైనాన్స్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోస్ట్‌లో కొనసాగుతున్నారు.అయితే విశాఖ పాలిటిక్స్‌లో పీలా బ్రదర్స్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారిపోయారు. క్యాడర్ మీద, కిందిస్థాయి నేతలపై చిర్రుబుర్రులాడుతూ..పెద్ద పెద్ద బహిరంగ వేదికలపై రచ్చ చేస్తూ టాక్ ఆఫ్ ది కాంట్రవర్సీగా ఉంటున్నారట. ఈ మధ్యే హోంమంత్రి అనిత అనకాపల్లి జిల్లాలో పర్యటించారు. ఆమె తిరుగు ప్రయాణమైన సమయంలో తన అనుచరులుతో కలిసి అనితతో మాట్లాడేందుకు పీలా గోవింద్ ప్రయత్నాలు చేశారు. అయితే తన బిజీ షెడ్యూల్ కారణంగా పీలా గోవింద్‌ను గమనించకుండా హోంమంత్రి కారెక్కి వెళ్లిపోయారుతాను పిలిచినా సరే కనీసం ఖాతరు చేయకుండా కారెక్కి వెళ్లిపోవడమేంటని పీలా గోవింద్ హోంమంత్రి అనితకు నేరుగా ఫోన్ కాల్ చేశారు. తన క్యాడర్ ముందు స్పీకర్ పెట్టి మాట్లాడారు. తాను మాజీ ఎమ్మెల్యేనని, లెక్క చేయకుండా వెళ్లిపోవడం ఏంటని రుసరుసలాడారు. దీంతో అనిత పరిస్థితిని వివరించి సర్ది చెప్పుకోవాల్సి వచ్చింది. తన అనుచరుల ముందు తనకు అవమానం జరిగిందంటూ పీలా గోవింద్ నానా యాగీ చేయడం చర్చనీయాంశంగా మారింది.ఇగో విషయంలో సోదరుడు పీలా గోవింద్‌కు తానేం తక్కువ కాదంటూ మేయర్ పీలా శ్రీనివాసరావు కూడా రెచ్చిపోయారు. విశాఖ ఉత్సవ్ ప్రారంభోత్సవ వేడుకలకు రాష్ట్ర మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అయితే ప్రారంభోత్సవ సమయంలో వేదికపై సీట్ల సర్దుబాటులో భాగంగా కలెక్టర్ హరేందిర ప్రసాద్..జోక్యం చేసుకుని మేయర్ పీలా శ్రీనివాసరావును మరో చోటకు మారాలని సూచించారు. అంతే వెంటనే మేయర్ ఒంటికాలిపై లేచి కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ మేయర్ అంటే కనీసం గౌరవం లేదా.? నన్నే సీటు మారమంటారా.? ప్రొటోకాల్ తెలియదా.? నీ సంగతి చూస్తా అంటూ వార్నింగ్ ఇచ్చారు. కలెక్టర్ సర్ది చెప్పబోయినా సరే పీలా శ్రీనివాసారవు ఏమాత్రం పట్టించుకోలేదు. వేదికపై నుంచి కిందకు వెళ్లిపోయారు.

ఉత్సవ్ ఓపెనింగ్‌కు వచ్చిన ప్రజలు, అటు ప్రజాప్రతినిధులు మేయర్ గారి దూకుడును చూసి విస్తుపోయారట.పీలా సోదరులు ఇలా చిందులేయడం ఇదేం కొత్త కాదంట. ఎన్నికల టైమ్‌లో టీడీపీ అధిష్టానం అనకాపల్లి ఎమ్మెల్యే సీటును జనసేనకు కేటాయించడంతో అప్పటి టికెట్ ఆశావహుడు పీలా గోవింద్ చేసిన రచ్చ అంతా ఇంతా కాదంటున్నారు. ఏకంగా చంద్రబాబును వ్యతిరేకిస్తూ తన క్యాడర్‌ను రంగంలోకి దించి దిష్టిబొమ్మలు తగులపెట్టడం, ఫ్లెక్సీలు చించడం, చంద్రబాబు, లోకేశ్‌పై దూషణలకు దిగారంటూ గుర్తు చేస్తున్నారు.అలాగే పీలా శ్రీనివాసరావు కూడా గత కార్పొరేషన్ ఎన్నికలకు ముందు పలువురు కార్పొరేటర్లకు ఫండింగ్ చేసి చీటికి మాటికి రెచ్చిపోయేవారట. అప్పట్లో పార్టీ పరిస్థితుల దృష్ట్యా నేతలంతా సర్దుకుపోయారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా సరే పీలా సోదరులు ఏ మాత్రం మారడం లేదని తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారట.

చీటికి..మాటికి అలక పాన్పు ఎక్కడం.. లేకుంటే, సహనం కొల్పోయి, కోపంతో పక్కవారిపై అరవడం వీళ్లకు అలవాటుగా మారిందని గుసగుసలు పెట్టుకుంటున్నారట.తండ్రి మహలక్ష్మి నాయుడు పార్టీకి వీర విధేయుడని..కుమారులకు అవకాశాలు ఇస్తే ఇలా రోడ్ల మీద వీరంగం వేసి పార్టీని బజారుకు ఈడుస్తున్నారని మండిపడుతున్నారు పలువురు తెలుగు తమ్ముళ్లు. ఈ అన్నదమ్ముల వ్యవహార తీరు ఎప్పుడు మారుతుందో..తమకు ఎప్పుడు ఈ తలపోటు తప్పుతుందోనని రగిలిపోతున్నారట టీడీపీ లీడర్లు.

# జూన్ 26న భోగాపురం ఎయిర్ పోర్ట్ రెడీ

విజయనగరం, జనవరి 29, ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్. ఏపీలో ఇప్పటికే చాలా ఎయిర్‌పోర్టులు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప, కర్నూలు, రాజమండ్రి వంటి జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. త్వరలో మరో కొత్త ఎయిర్‌పోర్ట్ ఏపీ ప్రజలకు అందుబాటులోకి రానుంది. దీని వల్ల ప్రధానంగా ఉత్తరాంధ్ర ప్రజలకు భారీ లబ్ది చేకూరనుంది. ప్రయాణ సౌకర్యంతో పాటు ఎయిర్‌పోర్ట్ వల్ల రవాణా సౌకర్యాలు పెరగడం వల్ల కొత్త కంపెనీలు రానున్నాయి. దీంతో హోటళ్లు, లాజిస్టిక్ వ్యాపారం పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే ఈ ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తవ్వగా.. ఏప్రిల్‌లో ప్రారంభించనున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్స్ పూర్తయ్యాయి.భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఎప్పుడు ప్రారంభం అవుతుందనే దానిపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్లారిటీ ఇచ్చారు. జూన్ 26న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జనవరి 1వ తేదీన ట్రయల్ రన్ కింద తొలి విమానం ల్యాండ్ అయినట్లు తెలిపారు. ఈ ట్రయల్ రన్‌లో భాగంగా ఢిల్లీ నుంచి ఇండిగో విమానం భోగాపురంకు చేరుకుంది. ఈ విమానంలో రామ్మోహన్ నాయుడితో పాటు ఎంపీలు, విమానయాన సంస్థ ఉన్నతాధికారులు ప్రయాణించారు. ఈ ఎయిర్‌పోర్ట్ పనులు దాదాపు అన్నీ పూర్తయ్యాయని, ప్రారంభించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయని తాజాగా రాహ్మోహన్ నాయుడు అన్నారు. అటు భారత్‌లో విమానాల తయారీకి బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఏపీ, గుజరాత్‌లో తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. ఈ క్రమంలో భోగాపురంలో చేత యూనిట్‌ను ఎంబ్రాయ్ సంస్థ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. భూమి కేటాయించడంతో పాటు మౌలిక సదుపాయాల కోసం వసతులు కల్పిస్తామని ప్రభుత్వం ఆఫర్ ఇచ్చిందిఎంబ్రాయర్ సంస్థ చిన్న, మధ్యస్థ, సైనిక, ట్రాన్స్‌పోర్ట్ విమానాలను తయారు చేయనుంది. దీంతో భోగాపురంలో మెయింటనెన్స్ రిపేర్ అండ్ ఓవర్ హాల్, ఏరోస్పేస్ కస్టర్లు ఏర్పాటు చేసేలా ఏపీ ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. భోగాపురంలో ఇది ఏర్పాటు చేస్తే మరింత ప్రయోజనం జరగనుంది. భారత్‌లో ఎంబ్రాయర్ సంస్థ విమాన తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనుండంపై రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. భారత్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామమని తెలిపారు. భారత్ విమానయాన రంగంలో ఇదొక కీలక మైలురాయిగా పేర్కొన్నారు.ఈ భూముల్లో విమానాల తయారీ ప్రాజెక్టును కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ పారిశ్రామిక పార్కుకు భూములు చాలా అనుకూలమైన ప్రదేశంలో ఉన్నాయి. ఇవి జాతీయ రహదారికి దగ్గరగా ఉన్నాయి.. అలాగే బెంగళూరు దేవనహల్లి అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా సమీపంలోనే ఉన్నాయి. ఈ కారణాల వల్ల రవాణా సౌకర్యం చాలా బాగుంటుందని చెబుతున్నారు. మొత్తం మీద విమానాల తయారీ కేంద్రాలు కనుక ఏర్పాటు చేస్తే.. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు దశ తిరిగినట్లే.

# మూడేళ్ల ముందు నుంచే అభ్యర్థులు

కడప, జనవరి 29, వైసీపీ అధినేత వైఎస్ జగన్ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టారు. ముందుగా కడప జిల్లాలో పట్టు మళ్లీ పెంచుకునే ప్రయత్నంలో పడ్డారు. గత ఎన్నికల్లో కడప జిల్లాలో కేవలం మూడు నియోజకవర్గాల్లో మాత్రమే వైసీపీ గెలిచింది. మొత్తం పది నియోజకవర్గాలుండగా అందులో మూడింటిలోనే విజయం సాధించడం జగన్ పై ఉన్న వ్యతిరేకతకు కారణమయింది. అయితే కడప జిల్లాలో ఓటమికి అనేక కారణాలున్నాయి. వాటిని ఒక్కొక్కటిగా తొలగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మైదుకూరు నియోజకవర్గంలో ఈసారి కొత్త ట్రెండ్ కు తెరలేపుతున్నారు. మైదుకూరు నియోజకవర్గం అంటే తొలి నుంచి కాంగ్రెస్ తర్వాత వైసీపీకి బలం ఉన్న ప్రాంతం. అక్కడ ఓటు బ్యాంకు ఎక్కువగా యాంటీ టీడీపీ ఉన్నట్లు అనేక ఫలితాలు వెల్లడించాయి.అయితే 2024 ఎన్నికల ఫలితాలు మాత్రం వైసీపీని దెబ్బతీశాయి. ఇందులో మరొక కోణం కూడా ఉంది. అదే సామాజికవర్గం కోణం. మైదుకూరు నియోజకవర్గంలో మొదటి నుంచి రెడ్డి సామాజికవర్గం నేతలే ఎన్నికవుతూ వస్తున్నారు. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం తొలిసారి యాదవ సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేత పుట్టాసుధాకర్ యాదవ్ కు మైదుకూరు ప్రజలు అండగా నిలిచారు. 1955లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ పదిహేను సార్లు ఎన్నికలు జరిగితే పథ్నాలుగు సార్లు రెడ్డి సామాజికవర్గం నేతలే ఎన్నికయ్యారు. అయితే మొన్నటి ఎన్నికల్లో రెడ్డి యేతర సామాజికవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయి రికార్డు బ్రేక్ చేశారు. బీసీల్లోనూ యాదవులు ఎక్కువగా ఉండటంతో అక్కడ గెలుపు సాధ్యమయిందిదీంతో వచ్చే ఎన్నికల్లోనూ జగన్ యాదవ సామాజికవర్గానికి చెందిన నేతకే టిక్కెట్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. కడప పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్క బీసీకి కూడా టిక్కెట్ ఇవ్వకపోడం ఓటమికి కారణంగా జగన్ గుర్తించారు. కడప పట్టణ నియోజకవర్గం మాత్రం ముస్లిం మైనారిటీలకు ఇస్తూ వస్తున్నారు. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గానికే కేటాయిస్తూ వస్తున్నారు. దీంతో ఈ సారి ఆ విధానాన్ని మార్చి మైదుకూరులో బీసీని పోటీ చేయించాలన్న ఉద్దేశ్యంతో జగన్ ఉన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న రమేష్ యాదవ్ ను ఈసారి మైదుకూరు నుంచి పోటీ చేయించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారని తెలిసింది. రమేష్ యాదవ్ సొంత గ్రామం కూడా అదే నియోజకవర్గం పరిధిలో ఉండటంతో ఈ సారి ముందుగానే అక్కడ అభ్యర్థిని జగన్ ఫిక్స్ చేశారని, రమేష్ యాదవ్ కు కూడా చెప్పడంతో ఆయన మైదుకూరు నియోజకవర్గంపై ఫోకస్ పెట్టారట.

# అనంతలో ఏరోస్పేస్ సెంటర్

అనంతపురం, జనవరి 29, ఆంధ్రప్రదేశ్‌లో విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్ సంస్థ అదానీ ఏరోస్పేస్‌తో కలిసి ఇక్కడ తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ఆసక్తి చూపుతోంది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో భారీ పారిశ్రామిక పార్కులు, భూసేకరణ ప్రక్రియలు వేగవంతమయ్యాయి. ఈ ప్రాజెక్టుల రాకతో రాష్ట్రానికి రూ. వేల కోట్ల పెట్టుబడులను, వేలాది ఉద్యోగాలను తెచ్చే అవకాశం ఉంది అంటున్నారు.. అదానీ ఏరోస్పేస్‌తో బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఎంబ్రాయెర్‌కు వ్యాపార, వాణిజ్య, సైనిక విమానాలు, విడిభాగాల తయారీలో మంచి పేరుంది. ఈ సంస్థ దేశంలో విమానాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్ రేసులో ఉన్నాయి. ఏపీ ప్రభుత్వం పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములను అందించడానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ కొత్త పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి వచ్చే నెలలో ఈ ప్రాజెక్టుపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు. ఎంబ్రాయెర్ సంస్థ విమానాలు, విమానాల విడిభాగాల తయారీలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది.ఏపీలో ఈ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వస్తే కనుక.. అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందట. ఈ విమానాల తయారీ కేంద్రం కోసం అనంతపురం జిల్లాలో ఖాళీగా ఉన్న భూములను కేటాయించాలని ప్రతిపాదనలు వచ్చాయి. ఇప్పటికే ఈ ప్రాంతాన్ని విమానల తయారీ కేంద్రంగా మార్చాలని ప్లాన్ చేశారు. బెంగళూరుకు సమీపంలో ఉండటం ఈ ప్రాంతానికి ఒక పెద్ద ప్లస్ పాయింట్. సరళ ఏవియేషన్స్ సంస్థ ఎలక్ట్రికల్ వర్టికల్ టేకాఫ్‌కు ల్యాండింగ్ విమానాలను (రూ.1,300 కోట్ల పెట్టుబడితో 500 ఎకరాల్లో 6 సీటర్ల విమానాలు) తయారు చేయనుంది. వీటిని 'స్కై ఫ్యాక్టరీ'గా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. 2029 నాటికి ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్లాన్ చేశారు. అదానీ గ్రూప్, బ్రెజిలియన్ ఏరోనాటిక్స్ మేజర్ ఎంబ్రేర్ మంగళవారం వ్యూహాత్మక సహకారాన్ని ప్రకటించాయి. భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్లలో ఒకటి. ఈ భాగస్వామ్యం చిన్న, మధ్య తరహా నగరాలకు ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మంగళవారం దేశ రాజధానిలోని పౌర విమానయాన మంత్రిత్వ శాఖలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ భాగస్వామ్యాన్ని ప్రకటించారు. పౌర విమానయాన కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా మాట్లాడుతూ.. ఈ సహకారం కేవలం ప్రాంతీయ విమానాలను అసెంబుల్ చేయడానికి మాత్రమే పరిమితం కాదని అన్నారు.ప్రగతిశీల సాంకేతిక బదిలీ, నైపుణ్య అభివృద్ధి, బలమైన సప్లయ్ చైన, భారతదేశాన్ని ప్రాంతీయ విమానాలకు నమ్మకమైన తయారీ కేంద్రంగా మార్చడం కూడా ఇందులో ఉన్నాయి. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ మాట్లాడుతూ.. ఎంబ్రేర్ సహకారంతో భారతదేశంలో ప్రాంతీయ విమానాల తయారీ కర్మాగారం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంబ్రేర్ 150 సీట్ల వరకు వాణిజ్య జెట్‌లను తయారు చేస్తుంది. ఈ భాగస్వామ్యంతో భారత విమానయాన రంగంలో ఇప్పటికే బలమైన ఉనికిని కలిగి ఉన్న అదానీ గ్రూప్, భారతదేశంలో విమానాల తయారీ రంగంలోకి ప్రవేశిస్తోంది. దేశంలో ప్రాంతీయ రవాణా విమానాల కోసం రెండు కంపెనీలు తుది అసెంబ్లీ లైన్ ను కూడా ఏర్పాటు చేస్తాయి.అయితే ఈ సంస్థ తమ తయారీ యూనిట్‌లను ఆంధ్రప్రదేశ్, గుజరాత్ లలో పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భోగాపురంలో ఎంబ్రాయర్ ఫ్యాక్టరీ పెట్టాలని ఏపీ ప్రయత్నం చేస్తోంది. భూమి, మౌలికసదుపాయాలను కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంబ్రాయర్ కి ఆఫర్ ఇచ్చింది. భోగాపురంలో ఎంఆర్ ఓ, ఏరోస్పేస్ క్లస్టర్లను కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉంది.ఏపీ ప్రభుత్వం శ్రీ సత్యసాయి జిల్లాలో ఒక భారీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ పార్కు కోసం మొత్తం 20 వేల ఎకరాల భూమిని కేటాయించనున్నారు. ఇందులో ఇప్పటికే లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు కేటాయించిన 8,844 ఎకరాల భూమి కూడా ఉంది. ఈ భూములను కొడికొండ చెక్‌పోస్టు దగ్గర అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పరిధిలో ఉన్న భూములను వెనక్కు తీసుకునే ప్రయత్నాలు విజయవంతమయ్యాయని తెలుస్తోంది.. ఈ భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఇప్పటికే చుట్టుపక్కల మండలాల్లో భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

## సిద్ధార్థలూథ్రాకు కాసులే.. కాసులు

విజయవాడ, జనవరి 29, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యున్నత స్థాయి చట్టపరమైన పోరాటాల కోసం భారీగా ఖర్చు చేస్తోంది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రభుత్వం తరపున వాదించిన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రాకు తాజాగా రూ. 1,15,50,000 ఫీజుగా చెల్లిస్తూ హోం శాఖ రెండు వేర్వేరు జీవోలను విడుదల చేసింది. క్రైమ్ నెం. 21/2024 కు సంబంధించిన ఈ కేసులో నిందితులకు బెయిల్ రాకుండా అడ్డుకోవడంలో లూథ్రా కీలక పాత్ర పోషించారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 104 ప్రకారం, సెప్టెంబర్ 2025లో ఐదు రోజుల పాటు (19, 22, 23, 24, 26 తేదీల్లో) హైకోర్టులో జరిగిన విచారణకు సిద్ధార్థ్ లూథ్రా హాజరయ్యారు. ఈ ఐదు రోజులకు గానూ ఆయనకు కోటి రూపాయల ప్రొఫెషనల్ ఫీజును ప్రభుత్వం ఖరారు చేసింది. ఇందులో విశేషమేమిటంటే, సెప్టెంబర్ 24న ఒక్క రోజు హాజరీకే ఆయనకు రూ. 40 లక్షలు చెల్లించారు. మిగిలిన నాలుగు రోజులకు రోజుకు రూ. 10 లక్షల చొప్పున ఫీజు లెక్కించారు. దీనికి అదనంగా 10 శాతం క్లర్కేజీ (రూ. 10 లక్షలు) కలిపి మొత్తం రూ. 1.10 కోట్లు మంజూరు చేశారు.మరోవైపు, నవంబర్ 18, 2025న జరిగిన ఒకే ఒక్క విచారణ కోసం ప్రభుత్వం మరో రూ. 5.50 లక్షలను (రూ. 5 లక్షల ఫీజు + రూ. 50 వేల క్లర్కేజీ) జీవో నెం. 103 ద్వారా విడుదల చేసింది.సిద్ధార్థ్ లూథ్రా వంటి టాప్ రేటెడ్ లాయర్లను రంగంలోకి దించారంటేనే ఈ కేసు ఎంత సీరియస్సో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ వేదికగా వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా మద్యం పాలసీని మార్చడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 3,500 కోట్ల నుండి రూ. 5,000 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని సీఐడీ అభియోగం మోపింది. కొన్ని ప్రత్యేక డిస్టిలరీలకే మేలు చేసేలా టెండర్లు కట్టబెట్టడం, ప్రముఖ బ్రాండ్లను రాష్ట్రం నుండి తప్పించి నాణ్యత లేని లోకల్ బ్రాండ్లను ప్రోత్సహించడం ద్వారా భారీగా ముడుపులు అందాయని కేసు నమోదైంది. ఈ కేసులో గత ప్రభుత్వంలోని కీలక నేతలు, కొందరు ఐఏఎస్ అధికారులు నిందితులుగా ఉండటంతో ఇది రాజకీయంగా పెను దుమారం రేపుతోంది.ఈ కేసు కేవలం ఒక అవినీతి కేసు మాత్రమే కాదు, రాజకీయంగా కూడా ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకం. మద్యం కుంభకోణం ద్వారా సామాన్య ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, రాష్ట్ర ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడిందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కేసులో నిందితులు చాలా బలవంతులు కావడంతో, హైకోర్టులో వారికి బెయిల్ రాకుండా చూడటం, క్వాష్ పిటిషన్లను ఎదుర్కోవడానికి సిద్ధార్థ్ లూథ్రా వంటి నిపుణుల అవసరం ఏర్పడింది.సాధారణంగా ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు పరిమితుల కంటే సిద్ధార్థ్ లూథ్రా ఫీజు ఎక్కువగా ఉన్నప్పటికీ, కేసు ప్రాముఖ్యత దృష్ట్యా నిబంధనలను సడలించి మరీ ఈ నిధులను మంజూరు చేసింది. సిద్ధార్థ్ లూథ్రా గతంలోనూ రాష్ట్రానికి సంబంధించిన అనేక హై-ప్రొఫైల్ కేసులను డీల్ చేసిన అనుభవం ఉండటంతో, ప్రభుత్వం ఆయనపైనే పూర్తి నమ్మకం ఉంచింది.ఈ ఫీజులను చెల్లించడానికి ప్రభుత్వం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుండి ప్రత్యేక అనుమతులు తీసుకుంది. అమరావతిలోని డిప్యూటీ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ద్వారా ఈ మొత్తాన్ని నేరుగా లూథ్రా బ్యాంక్ ఖాతాకు జమ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ఖజానాపై ఇంత భారీ భారం పడుతున్నా, మద్యం స్కాం దోషులను బోనులో నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# నిధుల కోసం ఢిల్లీకి జనసేనాని



కాకినాడ, జనవరి 29, ఏపీ ఉప ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎక్కువగా రాష్ట్రంలోనే ఉండి తన శాఖల పనులను పర్యవేక్షిస్తున్న విషయం తెలిసిందే. దాదాపు గత ఇరవై నెలల కాలంలో ఒకటి రెండు సందర్భాలు తప్ప ఆయన ఢిల్లీ వెళ్లలేదు. పరిపాలనపై పూర్తి పట్టు సాధించాలనే ఉద్దేశంతో శాఖల పనితీరును దగ్గరుండి చూసుకుంటూ నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఇదిలా ఉండగా, మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో పాటు మంత్రి నారా లోకేష్ తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి అవసరమైన నిధుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఈసారి పవన్ కళ్యాణ్ కూడా ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారనే వార్త రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది. కేంద్ర బడ్జెట్ సమావేశాల మధ్యలో ఆయన పర్యటన ఉండబోతుందని జనసేన లోక్‌సభాపక్ష నేత బాలశౌరి వెల్లడించారు. ఈ పర్యటనలో పవన్ కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల మంత్రులతో విడిగా భేటీ అయ్యి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన నిధులపై చర్చించనున్నారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర రాజధానిగా నిర్ణయించిన అమరావతి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేంద్రం నుంచి రాబట్టడం ఆయన ప్రధాన లక్ష్యంగా ఉండనుందని చెప్పారు.అమరావతితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అదనపు నిధులు అవసరమని పవన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారని జనసేన వర్గాలు పేర్కొంటున్నాయి. దేశ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో పవన్‌కు ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం వినియోగించుకుంటారని పార్టీ నేతలు భావిస్తున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉన్నందున ఈ పర్యటన ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంటోంది.ఇటీవల కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా జనసేన తన అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేసింది. ఆ సమావేశంలో బాలశౌరి మాట్లాడుతూ అమరావతికి చట్టబద్ధత కల్పించేలా కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే యువతలో పెరుగుతున్న డ్రగ్స్ సమస్యపై తల్లిదండ్రుల్లో ఉన్న ఆందోళనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. డ్రగ్స్ నియంత్రణతో పాటు సోషల్ మీడియా దుర్వినియోగంపై కఠిన చట్టాలు అవసరమని, వీటిపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని జనసేన అభిప్రాయపడింది.అదేవిధంగా జల జీవన్ మిషన్ కింద ప్రతి గ్రామానికి తాగునీరు అందించే లక్ష్యంతో అన్ని జిల్లాలకు సరిపడా నిధులు కేటాయించాలని కోరింది. ఆక్వా కల్చర్ రంగంపై అమెరికా విధిస్తున్న పన్నుల ప్రభావం తీవ్రంగా ఉందని, ఆక్వా రైతుల సమస్యలపై పార్లమెంట్‌లో విస్తృత చర్చ జరిపి పరిష్కారం చూపాలని జనసేన కేంద్రాన్ని అభ్యర్థిస్తోంది. ఈ అన్ని అంశాలతో పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటన రాష్ట్ర భవిష్యత్తుకు కీలకంగా మారనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పిఠాపురం స్టేషన్ కు మహర్దశ

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాల గురించి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించిన పవన్ కళ్యాణ్ పిఠాపురంలో రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. రైల్ ఓవర్ బ్రిడ్జి లేని కారణంగా అనేక ఇబ్బందులు ప్రజలు పడుతున్నారని పవన్ కళ్యాణ్ కేంద్ర మంత్రికి తెలిపారు. మరొకవైపు పిఠాపురం రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేయాలని వినతి పత్రాన్ని అందచేశారు. కాకినాడ-పిఠాపురం మధ్య రైల్వే అనుసంధానం పెంచాలని కోరిన పవన్ కళ్యాణ్ దీనివల్ల పిఠాపురం నియోజకవర్గం కనెక్టివిటీ పెరుగుతుందని చెప్పారు. దీంతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టుల గురించి కూడా చర్చించారు.సేతు బంధన్ పథకం కింద మంజూరు చేసిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకం పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఇది 2030 జాతీయ రైల్ ప్రణాళికకు అనుగుణంగా లెవల్ క్రాసింగులు తొలగించేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు సహకరిస్తుందని తెలిపారు. పిఠాపురం ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణం అయినందున రైల్వే స్టేషన్ ను అమృత్ స్కీం కింద మోడల్ రైల్వే స్టేషన్ గా అభివృద్ధి చేయాలని కోరారు. అష్టాదశ శక్తిపీఠం, శ్రీ పాద శ్రీ వల్లభ స్వామి కొలువైన క్షేత్రం పిఠాపురంలో ఉన్నందున దర్శనం నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. వీటితోపాటు రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టుల గురించి పవన్ కళ్యాణ్ చర్చించారు. అశ్విని వైష్ణవ్ గారు సానుకూలంగా స్పందించినందుకుపవన్ కళ్యాణ్ గారు కృతజ్ఞతలు తెలిపారు.

# పదవి ఉన్నా... గౌరవం ఏదీ

శ్రీకాకుళం, జనవరి 29, గొల్ల బాబూరావు. ఒకప్పుడు ఆయనో గ్రూప్ వన్ ఆఫీసర్. ఇప్పుడు పెద్దల సభలో వైసీపీ రాజ్యసభ సభ్యుడు. షార్ట్ టర్మ్‌లో పొలిటికల్ లక్కీ ఛాన్స్ కొట్టి రాజ్యసభకు వెళ్లిన ఆయనకు ఇప్పుడో డౌట్ కొడుతోందట. 16 ఏళ్లకు పైగా రాజకీయాల్లో ఎన్నో ఎత్తులు..పల్లాలు చూసిన ఆయనకు అస్సలు మనసు కుదట పడట్లేదట. నా సేవలను వాడుకోండి అంటూ ఓపెన్ ఆఫర్ ఇస్తున్నారట.కాస్త వెయిట్ చెయ్..టైమ్ వచ్చినప్పుడు మా వాడకమేంటో చూపిస్తామని వైసీపీ పెద్దలు చెప్తున్నా..బాబూరావు మాత్రం నో కాంప్రమైజ్ అంటున్నారట. ఇప్పుడే తన వర్క్ స్టైల్ ఏంటో చూపిస్తానంటూ ఆసక్తి చూపిస్తున్నారట. చెప్పుకోదగ్గ పదవి ఉన్నా..పార్టీ మీటింగ్‌లలో..చివరకు అధినేత పర్యటనలకు కూడా తనకు ప్రత్యేక ఆహ్వానం లేదంటూ అనుచరుల దగ్గర ఫ్రస్టేట్ అవుతున్నారట.రాజ్యసక్ష సభ్యుడిగా హోదా ప్రకారం ప్రోటోకాల్ ఇచ్చి ప్రభుత్వ అధికారులు గౌరవ మర్యాదలు పాటిస్తున్నా సరే, పార్టీ పరంగా పెద్దగా ఇంపార్టెన్స్ ఇవ్వడం లేదని తెగ బాధపడిపోతున్నారట. వైసీపీ అధికారం అనేక కీలక సమావేశాలు, నిరసనలు, సభలు నిర్వహించినా సరే ఓ దళిత రాజ్యసభ సభ్యుడుగా తనకు మినిమం ప్రయారిటీ ఇవ్వలేదన్న ఫీలింగ్ ఆయనలో ఎక్కువైపోయిందట.

అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ చేపట్టినా కార్యక్రమాల్లో గొల్ల బాబూరావు ఎక్కడా కనిపించలేదు.దళితులపై దాడులు, వివాదాల అంశంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ పరామర్శలకు వెళ్లినా సరే గొల్ల బాబూరావుకు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదట. దళిత సామాజికవర్గం నుంచి రాజ్యసభ సభ్యుడుగా ఉన్నా సరే కనీసం ఆహ్వానం లేకపోవడం..పార్టీ తరుఫున తన వాయిస్ కూడా ప్రజల్లోకి వెళ్లకుండా చేయడం వెనుక ఏదో కుట్ర దాగి ఉందనేది గొల్ల బాబూరావు అనుమానమట. ఇటీవల ఆయన ఫ్రస్టేషన్ స్లో..స్లోగా మొదలై, ఇప్పుడు పీక్స్‌కు చేరిందట.త్వరలో పార్టీ అధ్యక్షుడు జగన్ దగ్గరే పంచాయితీ పెట్టాలని ఫిక్స్ అయిపోయారట గొల్ల బాబూరావు. కేవలం తన భవిష్యత్తుకు మాత్రమే పరిమితం కాకుండా, వైసీపీలో తన కుమారుడు పొలిటికల్ ఫ్యూచర్‌పై కూడా తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారట. పెద్దల సభకు ప్రాతనిధ్యం వహిస్తున్నా సరే పార్టీలో తన ప్లేస్ ఏంటో తనకే తెలియక కన్ఫ్యూజన్‌లో పార్టీలో ఎవరిని ఎటాక్ చేయాలో తెలియక గొల్ల అయోమయంలో అల్లాడిపోతున్నారట.గొల్ల బాబూరావు..వైసీపీ ఆవిర్భావం నుంచి అధినేత జగన్ వెంట నడిచారు. పాయకరావుపేట నియోజకవర్గంలో వైసీపీని పటిష్టం చేశారు. టీడీపీకి కంచుకోట వంటి పేట కోటను బద్దలు కొట్టి గొల్ల బాబూరావు తన సామ్రాజ్యాన్ని విస్తరించారు. మొదటి గ్రూప్ వన్ ఉద్యోగం చేసుకునే గొల్ల బాబూరావు 2009లో ఫస్ట్ టైమ్ కాంగ్రెస్ పార్టీ తరఫున పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలిచారు.వైసీపీ ఆవిర్భావం తర్వాత జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి జర్నీ స్టార్ట్ చేసి 2012 బైఎలక్షన్, 2019 సాధారణ ఎన్నికల్లోనూ ఫ్యాన్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అఖండ విజయం సాధించడంతో పార్టీలో సీనియార్టీ పరంగా, జగన్‌తో ఉన్న సాన్నిహిత్యంతో మంత్రి పదవి దక్కుతుందని ఆశించారు గొల్ల బాబూరావు. కానీ ఆయనకు భంగపాటు తప్పలేదు. వైసీపీ హయాంలో సెకండ్ టర్మ్‌లోనైనా మంత్రి పదవి వస్తుందని ఆశలు పెంచుకోగా, అవి కూడా అడియాశలయ్యాయి.అప్పటి నుంచి వైసీపీలో సీనియారిటీ, జగన్ పట్ల సిన్సియారిటీని పక్కన పెట్టి పార్టీకి వ్యతిరేకంగా, అధినేత జగన్‌ను లెక్క చేయకుండా గొల్ల బాబూరావు రచ్చకెక్కడం మొదలు పెట్టారు. మంత్రి పదవి దక్కకపోవడం, అవమానకరంగా, ఆత్మగౌరవ వ్యవహారంగా ఫీల్ కావడంతో బాబూరావు తన పొలిటికల్ మైండ్‌కు పని చెప్పారు. కొందరు పార్టీ పెద్దలు తన మంత్రి అవకాశాలకు అడ్డుపడ్డారని, సందర్భం వచ్చినప్పుడు తనలో విప్లవకారుడిని చూస్తారంటూ ఆయన ఇచ్చిన వార్నింగ్‌లు అప్పట్లో ఫ్యాన్ పార్టీలో దుమారం రేపాయి.అయితే 2024 ఎన్నికల నాటికి పాయకరావుపేటలో అంతర్గత రాజకీయాలు అదుపు తప్పడంతో ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యే బాబూరావును కాదని..పొరుగు జిల్లాకు చెందిన కంబాల జోగులును బరిలోకి దించింది వైసీపీ. ఇది అట్టర్ ఫ్లాఫ్ పొలిటికల్ ఎక్స్‌పరిమెంట్‌గా ఎలక్షన్ రిజల్ట్ వచ్చాక గాని వైసీపీకి అర్థం కాలేదు.

ఈ పరిణామాల తర్వాత గొల్ల బాబూరావు రాజకీయ భవిష్యత్తు డైలమాలో పడ్డట్లు అయింది.కానీ, అదృష్టం ఏ రూపంలో వస్తుందో ఎవరూ ఊహించలేరన్నట్లు రాజ్యసభ సీటు బాబూరావుని వెతుక్కుంటూ వచ్చి ఆయన ఇంటి ముందు వాలిపోయింది. దీంతో గొల్ల బాబూరావు మంత్రి పదవి రాకపోయినా సరే ఏదో రాజ్యసభ దక్కిందని సరిపెట్టుకుని ఢిల్లీకి పయనమైపోయారు. కానీ ఇప్పుడు సరైన ప్రాధాన్యత దక్కట్లేదు..తన సేవలను సరిగ్గా వాడుకోవట్లేదన్న ఆవేదనలో ఉన్నారట ఆయన. త్వరలో అధినేతను కలిసి తన మనసులో మాటను చెప్పడంతో పాటు..తన కుమారుడి పొలిటికల్ ఫ్యూచర్‌పై కూడా జగన్‌ను ముందు ఓ ప్రపోజల్ పెట్టాలని డిసైడ్ అయ్యారట. మరి బాబూరావు రిక్వెస్ట్‌ను జగన్ ఎంతవరకు పరిగణలోకి తీసుకుంటారో..ఆయన సేవలను పార్టీ ఎలా వాడుకుంటుందో వేచి చూడాలి.

# మోడీ నోట భజన్ క్లబ్బింగ్..

ముంబై, జనవరి 29 (న్యూస్ పల్స్) ప్రధాని నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత చేపట్టిన కొత్త కార్యక్రమాల్లో మన్‌కీబాత్ ఒకటి. రేడియో ద్వారా మారుమూల ప్రజలకు సైతం ఆయన సందేశాని పంతున్నాడు. ఇక ప్రతీ మన్‌కీబాద్‌తో ఒక కొత్త విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అనేక అంశాలను ఆయన పేర్కొన్నారు. తాజాగా అనంతపూర్ నీటి పొదపును ప్రశంసించారు. ఇదే సమయంలో జెన్ జెడ్ యువత చేస్తున్న 'భజన్ క్లబ్బింగ్'ను ప్రస్తావించారు. దీంతో నెటిజన్లలో ఆసక్తి రేగింది. సంప్రదాయ భజనలు, కీర్తనలు, శ్లోకాలతో నైట్‌లైఫ్‌ను పునర్వ్యవస్థీకరించే ఈ ట్రెండ్, ఆధ్యాత్మికతను క్లబ్ కల్చర్‌తో ముడిపెడుతోంది.ఇది కేవలం ట్రెండ్ కాదు.. మానసిక శాంతికి కొత్త మార్గం. లిక్కర్, స్మోకింగ్ లేని ఈ ఈవెంట్లు లైవ్ కాన్సర్ట్‌ల రూపంలో జరుగుతూ, యువతను ఆకర్షిస్తున్నాయి.పాశ్చాత్య క్లబ్ సంస్కృతిలో డీజేలు, లైటింగ్, డ్యాన్స్ ఫ్లోర్ ఉంటే,ఈ భజన్ క్లబ్బింగ్‌లో భక్తి సంగీతం, మాండలిన్, టేబులా లాంటి సంగీత వాద్యాలు కీలకం. రాత్రి సమయంలో జరిగే ఈ కార్యక్రమాలు యువతకు ఒత్తిడి నివారణగా మారాయి. పోస్ట్?కోవిడ్‌లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరగడంతో ఇది ట్రెండ్ అవుతోంది. సోషల్ మీడియాలో వైరల్ వీడియోలు దీన్ని ప్రపంచవ్యాప్తం చేశాయి. భారతదేశంలో హైదరాబాద్, ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో ఈ ఈవెంట్లు జనాదరణ పొందుతున్నాయి.ఈ ట్రెండ్ యువతలో మానసిక స్థిరత్వాన్ని పెంచుతోంది. స్టడీల ప్రకారం, భజనలు ఆనంద హార్మోన్లను ఉత్పత్తి చేస్తాయి, ఒత్తిడిని తగ్గిస్తాయి. అలాగే, సాంకేతికత దూరంగా ఉంచి సామూహిక భక్తిని ప్రోత్సహిస్తోంది. సాంస్కృతికంగా, ఇది భారతీయ విలువలను ఆధునిక యువకులకు అనుకూలంగా చేస్తోంది. పాశ్చాత్య ప్రభావాల మధ్య స్వదేశీ ఆధ్యాత్మికతను పునరుజ్జీవనం చేస్తున్నట్లు కనిపిస్తోంది. మోదీ ప్రస్తావన దీన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లింది.అయితే, వాణిజ్యీకరణతో భక్తి స్పృహ క్షీణించే ప్రమాదం ఉంది. కొన్ని ఈవెంట్లు టికెట్ ధరలు ఎక్కువ చేసి డబ్బు సంపాదనపై దృష్టి పెడుతున్నాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు దీన్ని సమాజకార్యాలతో ముడిపెట్టాలి. భవిష్యత్తులో ఈ ట్రెండ్ గ్లోబల్ స్థాయికి వెళ్లే అవకాశం ఉంది. భారతదేశం యోగా, మెడిటేషన్‌తోపాటు భజన్ క్లబ్బింగ్‌ను 'సాఫ్ట్ పవర్'గా ప్రపంచానికి అందించవచ్చు

# కేంద్ర కేబినెట్ లో నాగబాబు..?



విజయవాడ, జనవరి 29 ఏపీలోశరవేగంగా రాజకీయాలు మారుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. రాజకీయంగా పట్టు బిగించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కానీ ఆ పార్టీకి ఎంత మాత్రం అవకాశం ఇవ్వకూడదని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అయితే పాలనాపరంగా చంద్రబాబు బిజీగా ఉండగా.. కూటమికి రాజకీయ రక్షణగా పవన్ కళ్యాణ్ ఉంటున్నారు. అందుకే విదేశీ పర్యటనలతో పాటు పెట్టుబడుల అన్వేషణ, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం వంటి అంశాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు చంద్రబాబు. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం తన గ్రామీణ శాఖలతో పాటు రాజకీయపరమైన అంశాలకు పరిమితమవుతున్నారు. ఇటువంటి తరుణంలో పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటన కొనసాగుతుండడం అనేక రకాల చర్చ నడుస్తోంది. ఈరోజు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో పాటు రైల్వే శాఖ మంత్రి వైష్ణవును కలుసుకోనున్నారు పవన్. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల ను పూర్తి చేయడం, కూటమిపరంగా రాజకీయ అంశాలపై కీలక చర్చలు జరుపుతారని తెలుస్తోంది.ఈ ఏడాది జూన్లో ఏపీ నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతాయి. అయితే ఆ నాలుగు స్థానాలు టిడిపి కూటమికి దక్కుతాయి. గతంలో రెండు సార్లు రాజ్యసభ పదవులకు ఖాళీ ఏర్పడింది. టిడిపి తో పాటు బిజెపి ఆ పదవులను దక్కించుకుంది. జనసేనకు వివిధ సమీకరణలో భాగంగా చాన్స్ లేకుండా పోయింది. జనసేనకు ఇంతవరకు రాజ్యసభ ప్రాతినిధ్యం లేదు. ఈసారి రాజ్యసభ సీటుతో పాటు కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కించుకోవాలని పవన్ భావిస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న పవన్ కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా తో ఇదే విషయం చర్చిస్తారని తెలుస్తోంది. రాజ్యసభ పదవితో పాటు కేంద్ర మంత్రి పదవి తమ పార్టీకి ఇవ్వాలన్న ప్రతిపాదన పెట్టనున్నట్లు సమాచారం.ఒకవేళ జనసేనకు రాజ్యసభ తో పాటు మంత్రి పదవి వస్తే ఎవరికి ఇస్తారు అన్నది ఇప్పుడు ప్రశ్న. ఇప్పటికే జనసేనకు ఇద్దరు లోక్సభ సభ్యులు ఉన్నారు. మచిలీపట్నం నుండి వల్లభనేని బాలశౌరి ఉన్నారు. కేంద్ర క్యాబినెట్లో జనసేనకు అవకాశం ఇస్తే ఆయన పేరును పరిశీలించే అవకాశం ఉంది. అయితే మెగా బ్రదర్ నాగబాబుకు కేంద్ర రాజకీయాలు అంటే ఇష్టం. రాజ్యసభ ద్వారా పెద్దల సభలో అడుగు పెట్టాలని ఆలోచన ఉండేది. ఆ ఛాన్స్ రాకపోయేసరికి సీఎం చంద్రబాబు గత ఏడాది నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటామని ప్రకటించారు. అయితే ఎమ్మెల్సీ అయ్యారు కానీ ఏడాది అవుతున్న మంత్రి వర్గంలోకి తీసుకోలేదు. అయితే ఇప్పుడు జనసేనకు రాజ్యసభ పదవి ఇచ్చి కేంద్ర క్యాబినెట్లో ఛాన్స్ ఇస్తే నాగబాబుని పంపిస్తారని ప్రచారం నడుస్తోంది. దానిపై కూడా పవన్ కళ్యాణ్ హోం శాఖ మంత్రి అమిత్ షా తో చర్చిస్తారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. మరి ఈ ప్రచారంలో నిజం ఎంత ఉందో చూడాలి

# కంటైనర్ను ఢీకొట్టిన లారీ.. క్లీనర్ సజీవదహనం



కాకినాడ జిల్లాలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కత్తిపూడి సమీపంలోని రావికంపాడు జంక్షన్ వద్ద లారీ కంటైనర్ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో కంటైనర్లోనే క్లీనర్ సజీవదహనమైనట్లు సమాచారం.ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసారు.

# బడ్జెట్ పై రియల్ ఆశలు

ముంబై, జనవరి 29 ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ 2026ను ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్న తరుణంలో, రియల్ ఎస్టేట్ రంగం మరోసారి భారీ అంచనాలు పెట్టుకుంది. పుంజుకుంటున్న ప్రీమియం హౌసింగ్ డిమాండ్, మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధి, పెరుగుతున్న నిర్మాణ వ్యయాలతో, పరిశ్రమ సమస్యలు పరిష్కరించగల, పర్మిషన్స్ వేగవంతం చేయగల, విస్తరిస్తున్న రంగానికి అనుగుణంగా చేపట్టే సంస్కరణల బడ్జెట్ కోసం రియల్ ఎస్టేట్ రంగం ఎదురు చూస్తోంది. గృహ రుణ పన్నుపై ఉపశమనం కోరుకునే గృహ కొనుగోలుదారుల నుంచి పరిశ్రమ హోదా, వేగవంతమైన అనుమతులను కోరుతున్న డెవలపర్‌ల వరకు, భారతదేశ పట్టణ వృద్ధికి సంబంధించిన తదుపరి దశను రూపొందించడానికి బడ్జెట్ 2026 ఒక కీలకమైన క్షణంగా భావిస్తున్నారు.భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇటీవలి త్రైమాసికాల్లో గణనీయమైన వృద్ధిని ప్రదర్శించింది, దీనికి బలమైన తుది-వినియోగదారుల డిమాండ్, పెరుగుతున్న ఆకాంక్షలు, మౌలిక సదుపాయాలలో స్థిరమైన ప్రభుత్వ పెట్టుబడి కారణమయ్యాయి. అయినప్పటికీ, సవాళ్లు కొనసాగుతున్నాయి. కొనుగోలుదారులలో ఎక్కువ మందికి ఆర్థిక వెసులుబాటు ఒక అడ్డంకిగా ఉంది, అయితే డెవలపర్లు ఫైనాన్సింగ్ ఖర్చులు, నియంత్రణ జాప్యాలు, పెరుగుతున్న ఇన్‌పుట్ ధరలతో ఇబ్బంది పడుతున్నారు.పాధి కల్పన, ఉఆఖలో ఈ రంగం పాత్ర బలమైన ముద్ర వేస్తోంది. అందుకే సరైన గుర్తింపును కోరుతుందని పరిశ్రమ లీడర్లు వాదిస్తున్నారు. రియల్ ఎస్టేట్ అధికారికంగా పరిశ్రమ హోదాను మంజూరు చేయాలనే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ . దీన్ని నెరవేర్చాలని కోరుతున్నారు. ఇది చౌకైన వ్యవస్థీకృత నిధులను అన్‌లాక్ చేస్తుంది. నియంత్రణ పర్యవేక్షణను క్రమబద్ధీకరిస్తుంది.పట్టణ ప్రాంతాల్లో సరసమైన గృహాల విస్తరించడానికి చాలా స్కోప్ ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న టైర్ 2, టైర్ 3 నగరాల్లో భూమి, నిర్మాణ ఖర్చులను ప్రస్తుత ధరల పరిమితులు ఇకపై ప్రతిబింబించవని డెవలపర్లు వాదిస్తున్నారు, ఇక్కడ గృహ డిమాండ్ పెరుగుతోంది కానీ అధికారిక ప్రయోజనాలు పరిమితంగా ఉంటాయని అంటున్నారు.ప్రీమియం, లగ్జరీ హౌసింగ్ వైపు పెరుగుతున్న డిమాండ్ బడ్జెట్ అంచనాలను రూపొందించే మరొక ధోరణి. అనేక మార్కెట్లలో మిడ్-ప్రీమియం, హై-ఎండ్ విభాగాలు సరసమైన గృహాలను అధిగమిస్తుండటంతో, డెవలపర్లు సంస్థాగత పెట్టుబడి, దీర్ఘకాలిక మూలధన ప్రవాహాలకు మద్దతు ఇచ్చే విధానాలను కోరుకుంటున్నారు.సౌకర్యవంతమైన వర్క్‌స్పేస్ విభాగంలో, 315 వర్క్ అవెన్యూ వ్యవస్థాపకుడు మానస్ మెహ్రోత్రా, కోవర్కింగ్ సేవలకు, ముఖ్యంగా స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాలకు రాయితీ, స్లాబ్ ఆధారిత ఊూ రేట్ల కోసం పిలుపునిస్తున్నారు. ఇంటీరియర్ ఫిట్-అవుట్‌లపై బ్లాక్ చేసిన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను తొలగించాలని, కోవర్కింగ్ చెల్లింపులపై 10 శాతం ఎఆూ హేతుబద్ధీకరణను కూడా ఆయన కోరుకుంటున్నారు. భారతదేశ కోవర్కింగ్ పర్యావరణ వ్యవస్థను స్కేల్ చేయడానికి మెరుగైన నగదు ప్రవాహ నిర్వహణ, సంస్థాగత ఫైనాన్స్‌కు ప్రాముఖ్యత చాలా అవసరం అని అంటున్నారు. భారతదేశం రియల్ ఎస్టేట్ రంగం టైర్ 2కు విస్తరణ తదుపరి దశలోకి ప్రవేశిస్తున్నందువ గృహ డిమాండ్‌ను నిర్మాణాత్మకంగా పెంచడానికి బడ్జెట్ 2026 ఒక అవకాశం అని ఖీఇం ఇండియా అఖా ప్రవీణ్ శర్మ అన్నారు. డిజిటల్ గవర్నెన్స్ ద్వారా స్థిరమైన సరసమైన గృహ మద్దతు, మరింత ఆచరణాత్మక గృహ రుణ పన్ను ప్రయోజనాలు, వేగవంతమైన ఆమోదాల అవసరాన్ని ఆయన ఎత్తి చూపారు.గృహ డిమాండ్ మాత్రమే కాదు, రాబోయే దశాబ్దంలో భారతదేశ వృద్ధిని నిర్వచించే విస్తృత పట్టణ పరివర్తన కూడా ప్రమాదంలో ఉంది. దాదాపు 250 అనుబంధ పరిశ్రమలకు రియల్ ఎస్టేట్ ఇంధనంగా పనిచేస్తుండటంతో, మద్దతు ఇచ్చే, ఊహించదగిన, సంస్కరణ-ఆధారిత బడ్జెట్ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేయగలదని, స్థోమతను మెరుగుపరచగలదని, భారతదేశ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను మరింత ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ ప్రాతిపదికన ఉంచగలదని పరిశ్రమ నాయకులు వాదిస్తున్నారు.

# కమలానికి మున్సిపల్ పరీక్ష

హైదరాబాద్, జనవరి 29, ఈసారి పురపోరు బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారనుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అంతంత మాత్రంగానే సీట్లు దక్కించుకున్న బీజేపీకి ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష కానున్నాయి. అధికారంలోని కాంగ్రెస్ పార్టీకి తామే ప్రత్యామ్నాయమని చెప్పుకునే కమలం పార్టీ ఇప్పు డు ఆశలన్నీ మున్సిపల్‌పైనే పెట్టుకుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలంటే ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ గెలవాల్సిన పరిస్థితి. ఈ ఫలితాలను బట్టే ప్రజల్లోకి పాజిటివ్ సంకేతాలు వెళ్తాయి.మొదటి నుంచి తమకు అర్బ న్ (పట్టణ) ప్రాంతాల్లోనే బలం ఉందని చెప్పుకుంటున్న బీజేపీ ఈ ఎన్నికల్లో అత్యధికంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, వార్డులను కైవసం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే వరుసగా ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ నాయకులకు ఇన్‌చార్జీలు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే జాతీయ నాయకత్వం ముగ్గురు ఎన్నికల ఇన్‌చార్జీలు, కో ఇన్‌చార్జీలను నియమించగా త్వర లోనే జాతీయ అధ్యక్షుడితోపాటు పలువురు జాతీయ నాయకులకు ఏకంగా రంగంలోకి దింపబోతోందిరాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు, 2,996 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ ప్రక్రియకు రేపటితో ఆఖరు గడువు. అయితే గత మున్సిపల్ ఎన్నికల్లో 322 కౌన్సిలర్లు, కార్పొరేటర్లను బీజేపీ గెలుచుకుంది. వీటితోపాటు ఐదు మున్సిపల్ చైర్మన్లను బీజేపీ తమ ఖాతాలో వేసుకుంది. మొన్న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 5000 మందిని బరిలోకి దింపి 800 నుంచి 1000 వరకు పంచాయతీలను గెలుచుకుంది.గ్రామీణంలో తమకు పెద్దగా బలం లేదని, పట్టణమే తమ బలమని కమలం పార్టీ ముందు నుంచి అంటోంది. ప్రజల్లోనూ బీజేపీ అంటే అర్బన్ పార్టీ అనే ముద్రనే ఉంది. ఇప్పుడిదే బీజేపీకి అగ్నిపరీక్షగా మారింది. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడా అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. రాజకీయ పార్టీల గుర్తుల మీద ఈ ఎన్నికలు జరుగనుండటంతో పురపోరులో ఏ పార్టీ బలమెంతో స్పష్టమవుతుంది. తమకున్న పేరును నిలుపుకోవాలన్నా...వచ్చే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలన్నా ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయబావుటా ఎగురవేయాల్సిందే.ఇందులో భాగంగానే బీజేపీ ఈసారి పెద్ద టార్గెట్‌ను పెట్టుకుంది. మొత్తం మున్సిపాలిటీల్లో 50 నుంచి 60 శాతం వరకు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అలాగే ఏడు కార్పొరేషన్లలో నాలుగు నుంచి ఐదు వరకు గెలుచుకునేలా వ్యూహాలను అమలు చేస్తోంది. వీటితోపాటు పార్టీ తన ఉనికిని చాటుకునేలా ఎక్కువ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలుచుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.నూతనంగా ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో వారం రోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు భేటీ అయ్యారు. ఢిల్లీ నుంచి ఆయన వచ్చిన వెంటనే అత్యవసరంగా పార్టీ పదాధికారుల మీటింగ్ నిర్వహించి నాయకులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ నాయకత్వం ఇప్పటికే ముగ్గురిని రంగంలోకి దింపిందని, వారికి మున్సిల్ ఎన్నికల ఇన్‌చార్జులుగా నియమిస్తూ.. మహారాష్ట్ర మంత్రి ఆశిష్ శెలార్‌కు, కోఇన్‌చార్జీలుగా రేఖా శర్మ, అశోక్‌కు బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారువీరు ముఖ్యనాయకులతో వరుసగా ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ ఎన్నికల వ్యూహాలను రచిస్తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఆయా జిల్లాలు, నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల టాస్క్‌లను అప్పగించారు. వీటికితోడూ ఇప్పటికే జిల్లా, మున్సిపాలిటీల వారీగా మరికొంత మంది రాష్ట్ర నేతలను ఇన్‌చార్జీలుగా రాష్ట్ర నాయకత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఫిబ్రవరి 7, 9వ తేదీల్లో వీటిని నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ సభలను ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణలో నిర్వహించాలని నిర్ణయించారు. తొలుత ఐదు సభలను నిర్వహించాలని అనుకున్న పార్టీ నేతలు దాన్ని రెండుకు కుదించినట్లుగా తెలిసింది. ఈ సభల ద్వారా ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ జాతీయ స్థాయి దిగ్గజాలను రంగంలోకి దించుతోంది.పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హాతో పాటు కీలక నేత అమిత్‌షా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉండడంతో ఎన్ని సభలు నిర్వహిస్తారో...ఎంత మంది నేతలు వస్తారనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే కమలనాథులకు ఈ పురపోరు ఎన్నికలు మాత్రం పరీక్షే అని చెప్పాలి.

# మేడారంలో... విరజిమ్ముతున్న విద్యుత్ వెలుగులు



ములుగు విద్యుత్ పరంగా మేడారంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సత్వర చర్యలు తీసుకుంటూ మిరుమిట్లు గొలిపేలా వెలుగుల మేడారంగా ఎన్పీడీసీఎల్ తీర్చిదిద్దింది.వెలుగుల జిగేల్ మనేలా తీరిచిద్దిన మేడారంకు అధికారులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది నిత్యం రౌండ్ ది క్లాక్ విధులు నిర్వహిస్తున్నారు , ఇద్దరు డైరెక్టర్లు టి.మధుసూదన్, వి.మోహన్ రావు. చీఫ్ ఇంజనీర్లు కె. రాజు చౌహన్, అశోక్ పర్యవేక్షణలో నలుగురు సూపరిండెంట్ ఇంజనీర్లు, ఏడుగురు డివిజన్ ఇంజనీర్లు, 30 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు 150 నుంది. 500 మంది ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు మూడు బ్యాచ్ లుగా 30 మంది చొప్పున విధులు నిర్వహిస్తున్నారు.

# ‘సింహం’ గుర్తుపై జాగృతి అభ్యర్థుల పోటీ

హైదరాబాద్, జనవరి 29, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ జాగృతి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కలిసి పోటీ చేయనున్నాయి. జాగృతి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ ‘సింహం’ గుర్తుపై పోటీ చేయనున్నారు. ఇక తొలిరోజు 902 నామినేషన్లు దాఖలు కాగా.. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయాలు హీటెక్కాయి. ప్రధాన పార్టీలతో పాటు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతుదారులు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి పోటీ చేసేందుకు రెడీ అయ్యారు.ఈ మేరకు జాగృతి అధ్యక్షురాలు కవిత, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకత్వం మధ్య జరిగిన కీలక చర్చలు ఫలించాయి. రానున్న పురపాలక ఎన్నికల్లో తెలంగాణ జాగృతికి చెందిన ఔత్సాహిక అభ్యర్థులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన ‘సింహం’ గుర్తుపై పోటీ చేయాలని నిర్ణయించారు. కేవలం ఈ ఎన్నికలకే పరిమితం కాకుండా.. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాడాలని ఇరు పక్షాలు అంగీకారానికి వచ్చాయి. హైదరాబాద్‌లోని ఫార్వర్డ్ బ్లాక్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం, కొత్త రాజకీయ సమీకరణాలకు నాంది పలికింది.ఇక బుధవారం నామినేషన్ల స్వీకరణ మొదటి రోజే అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొత్తం 2,996 వార్డులకు గాను తొలిరోజే 902 నామినేషన్లు దాఖలయ్యాయి. 890 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా.. కొందరు అభ్యర్థులు రెండేసి సెట్ల నామపత్రాలను సమర్పించారు. క్షేత్రస్థాయిలో తమ పట్టు నిరూపించుకునేందుకు అభ్యర్థులు ఉత్సాహం చూపుతున్నారు. మొదటి రోజు నామినేషన్ల పర్వంలో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 382 నామినేషన్లతో అగ్రస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ 258 నామినేషన్లతో రెండవ స్థానంలో ఉండగా, బీజేపీ నుంచి 169 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.నామినేషన్ల స్వీకరణకు శుక్రవారమే ఆఖరి గడువు కావడంతో.. నేడు, రేపు అభ్యర్థుల తాకిడి భారీగా పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అదనపు సిబ్బందితో ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. కాగా.. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనున్నాయి.

తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది.

ఈ పరిణామం ముఖ్యమైంది ఎందుకంటే తెలంగాణ జాగృతి సాధారణంగా సాంస్కృతిక, సామాజిక సంస్థగా పిలుస్తున్నా, ఇప్పుడు నేరుగా ఎన్నికల బరిలోకి దిగడం ద్వారా తన రాజకీయ బలాన్ని ప్రదర్శించాలని చూస్తోంది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన “సింహం” చిహ్నం ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు పరిచయమైందని, జాగృతి కార్మికుల చేరిక దాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుందని కవిత భావిస్తున్నారు. ఈ ఒప్పందం తెలంగాణ స్థానిక రాజకీయాల్లో కొత్త ఎత్తుగడకు కారణమవుతుందని అంటున్నారు. ఈ మధ్య కవిత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీ ఏర్పాటు, విధి విధానాలు, ప్రచార వ్యూహాలపై లోతుగా చర్చించారు. ఆ పనులు ఒకవైపు సాగుతుండగానే మరోవైపు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి అసలైన బలాన్ని అంచనా వేసుకోవాలని కవిత భావిస్తున్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు.

# మొక్కు తీర్చుకునేందుకు ఎడ్లబండ్లే...

వరంగల్, జనవరి 29, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత వైభంగా జరుగుతోంది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకూ మాత్రమేకాదు, తెలుగు రాష్ట్రాలు, దూరప్రాంతాల నుంచి రోజూ లక్షలాదిగా భక్తులు మేడారం జతరకు తరలివెళుతున్నారు.మేడారం సమ్మక్కా ,సారలమ్మ జాతర దర్శించుకోవడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చేవారు. ఆ తరువాత కాలంలో ఎడ్ల బండ్లపై రావడం ఆనవాయితీగా మారింది. వ్యవసాయ ఆధారిత గ్రామాలు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి ఎడ్లబండ్లపై అమ్మవారి జాతరకు ఓ నాలుగు రోజుల ముందే కుటుంబ సమేతంగా బయలుదేరేవారు. ముఖ్యంగా తెలంగాణలో ప్రతీ గ్రామం నుంచి బండెనక బండి కట్టి, పదహారు బళ్లు కట్టి అన్నట్లుగా ఒక్కో ఊరు నుంచి వందల బళ్లు మేడారం జాతరకు కదిలేవి. ఈ ఏడాది కూడా ఎడ్ల బండి సెంటిమెంట్ విషయంలో ఎక్కడా తగ్గేదే లేదంటున్నారు మేడారం భక్తులు. ఏఐ యుగంలోకి ప్రవేశించినా ఎడ్ల బండ్లంటేనే అమ్మవారికి మహా ఇష్టమంటున్నారు. ఈ ఏడాది మేడారం జాతరకు తెలంగాణ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంతగా అద్భుతంగా ఏర్పాట్లు చేసింది. మేడారం ప్రాంగణాన్ని వందల కోట్లతో కన్నుల పండుగగా అభివృద్ధి చేయడమేకాదు, దూర ప్రాంతాల నుండి మేడారం వెళ్లే భక్తుల కోసం వేలాదిగా ఆర్టీసి బస్సు సర్వీసులు నడపడమేకాదు, ఏకంగా తొలిసారి రెండు హెలికాప్టర్ల ను ఏర్పాటు చేసి గంటన్నరలో మేడారం దర్శనం చేసి తీసుకొచ్చేందుకు సర్వం సిద్దం చేసింది. హనుమకొండలో మీరు అలా హెలికాప్టర్ ఎక్కితే కేవలం 35 నిమిషాల్లో మేడారం , 30నిమిషాల్లోపు మేడారం దర్శనం, మరో 35 నిమిషాల్లో తిరిగి హనుమకొండకు చేర్చేలా హెలికాప్ట్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో వ్యక్తికి 36వేలు టిక్కెట్ ఖర్చుతో మొత్తం మేడారం దర్శనం అనుభూతి కల్పిస్తున్నారు.కేవలం గంటన్నరలోనే దర్శనం పూర్తి చేసుకునే అవకాశంతోపాటు అందుబాటులో ఆర్టీసి బస్సులు, ప్రవేటు వాహనాలు ఇలా అనేక మార్గాల ద్వారా మేడారం చేరుకునే సదుపాయాలు ఉన్నా, నేటికీ తెలంగాణలోని అనేక గ్రామాల నుండి ఎడ్ల బండ్లపై భక్తులు భారీగా తరలిరావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మాకు మగ బిడ్డ పుడితే ఎడ్ల బండిపై మేడారం వస్తామని మొక్కుకున్నాం. అమ్మ అనుగ్రహించింది ,మగ బిడ్డ పుట్టాడు. అందుకే ప్రతీ ఏడాది ఎడ్ల బండిపైనే మేడారం గద్దెలను దర్శించుకుంటున్నామని జాతరకు వస్తున్న కొందరు భక్తులు చెబుతున్నారు. ఇలా కొందరు సంతానం కోసం, మరికొందరు అనుకున్నది సాధించడం కోసం.. ఇలా మొక్కులు తీరడంతో ఎడ్ల బండ్లపైనే ప్రతీ జాతరకు సుదూర ప్రాంతాల నుండి సైతం తరలివస్తున్నారు.ఒక్కో ఎడ్ల బండిపై ఒక్కో కుటుంబం , వారితోపాటు అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి మేకపోతు,నాటు కోడి, నాలుగు రోజులకు అవసరమైన మద్యం, ఎడ్లకు ఓ ఐదు రో?జులకు సరిపడా ఎండుగడ్డి, ఎడ్ల బండ్లు మధ్యలో ఆపి సేదతీరెందుకు , పొలామధ్యలో దారాలు వేసి రాత్రి సమయంలో నిద్రించేందుకు పరదాలు, వంటకు అవసరమైన రైస్, కూరగాయలు, ఉప్పు, పప్పు, కట్టెలు, ఇలా అన్నీ ఎడ్ల బండిపైన సర్దుకుని మేడారం జాతరకు కుటుంబ సమేతంగా బయలుదేరడం తరతరాలుగా లక్షలాది మంది భక్తులకు ఓ సెంటిమెంట్ గా వస్తోంది. తెల్లవారుజామున లేచి, ఆరోజుకు సరిపడా మూడుపూటల భోజనం సిద్దం చేసుకుని ఇంటి వద్ద మొదలైన మేడారం ప్రయాణం, ప్రతీ పది లేదా పదిహేను కిలోమీటర్లకోసారి ఎడ్లను ఆపి, కాసేపు అందమైన పంటచేల మధ్యలో , ఆహ్లాదరకమైన అడవి మార్గంలో సేద తీరుతీరుతుంటారు. వాగులకు సమీపంలో భోజనం చేయడం, రాత్రి సమయంలో అక్కడే డేరాలు వేసుకుని నిద్రించడం, తిరిగి తెల్లవారుజామున మళ్లీ ప్రయాణం మొదలుపెట్టడం.. ఇలా మేడారం చేరుచుకునే మార్గమధ్యలో ఎడ్లబండి ప్రయాణం అంటే మాట్లల్లో చెప్పలేని సరికొత్త అనుభూతి అనడంలో ఏ మాత్రం సందేహంలేదు.అన్నదమ్ములు, ఆడపడుచులు, అక్క చెల్లెళ్లు , అత్త కోడళ్లు.. ఇలా అంతా తమ ఎడ్లబండ్లపై మేడారం సమీపంలో ఒకేచోటకు చేరుకుంటారు. అక్కడే ఎడ్లబండ్లకు డేరాలు కట్టి గుడారాలుగా మార్చుకుంటారు. అలా నాలుగు రోజులపాటు మేడారం పరిసర ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు ఒక్కటై మేడారం గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటారు. మందు ,ముక్క లేకుండా జాతర పూర్తవ్వదనే విషయం తెలిసిందే.. అలా సరదాగా గడపడం కోసం రెండేళ్ల కోసారి తెలంగాణలో రైతుల కుటుంబాలేకాదు, రైతులను నమ్ముకున్న ఎద్దులు సైతం ఎదురుస్తుంటాయట, ఓ ఏడాది జాతరకు వెళ్లిన ఎద్దులు, అదే మార్గం గుర్తుపెట్టుకుని రైతు చెప్పకుండానే మేడారం జాతర వద్దకు తీసుకెళ్లడం మరో విశేషంగా చెప్పవచ్చు.

# గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో ఈడీ ఛార్జిషీట్..

హైదరాబాద్, జనవరి 29, గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఈడీ దూకుడు పెంచింది. రూ. 11.30 కోట్ల విలువైన 35 ఆస్తులు.. నయీం అక్రమంగా సంపాదించినట్లు ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ ఆస్తులను అతడి కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఇతర బినామీల పేర్లపై రిజిస్టర్ చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా నయీం అక్రమాస్తుల విషయంలో పోలీసు, రాజకీయ సంబంధాలపై కూడా ఈడీ ఆరా తీస్తోంది. 2016లో జరిగిన ఎదురుకాల్పుల్లో నయీం హతం అయ్యాడు. గ్యాంగ్‌స్టర్ నయీం 2016లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. అతడికి సంబంధించిన అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేగం పెంచింది. నయీంపై జరిగిన మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు జరిపింది. తాజాగా నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిశీలించిన కోర్టు విచారణకు అంగీకరించింది. కాగా, గ్యాంగ్‌స్టర్ నయీం.. తన గ్యాంగ్ సభ్యులతో కలిసి దాదాపు రూ. 11. 30 కోట్ల విలువైన 35 ఆస్తులను అక్రమంగా సంపాదించినట్లు ఈడీ ఛార్జిషీటులో పేర్కొంది. కాగా, నయీంకు సంబంధించిన అక్రమాస్తులపై ఈడీ 10 మందిపై అభియోగాలు మోపింది. ఛార్జిషీట్ ప్రకారం.. నయీం యాదాద్రి భువనగిరి జిల్లాలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. ఈ ఆస్తులన్నీ నయీం తన కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఇతర బినామీల పేర్లపై రిజిస్టర్ చేసినట్లుగా ఈడీ అధికారులు గుర్తించారు. కాగా, నయీం అక్రమాస్తుల కేసులో అతడి భార్య హసీనా బేగంతో పాటు పలువురు కుటుంబ సభ్యుల పేర్లను ఈడీ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. అయితే ఈడీ ఆరోపిస్తున్న అక్రమాస్తులకు సంబంధిచి కొన్నిసార్లు నోటీసులు జారీ చేసినా.. స్పందించకపోవడం, ఐటీఆర్ పత్రాలు చూపించకపోవడంతో కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది.మరోవైపు, నయీంకు ఉన్న పోలీసులు, పొలిటికల్ సంబంధాలపై కూడా ఈడీ కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. అక్రమంగా సంపాదించిన సొమ్ము ఎక్కడికి వెళ్లింది.. ఇందులో అధికారులు, రాజకీయ నాయకుల హస్తం ఏమైనా ఉందా అనే కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ కేసులో త్వరలో నిందితులకు కోర్టు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.తెలుగు రాష్ట్రాల్లో అండర్ వరల్డ్ డాన్‌గా పేరున్న నయీం 2016 ఆగస్టు 8న ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. భూ సెటిల్‌మెంట్లు, చేస్తూ తనకంటూ ఓ గ్యాంగ్ ను మెయింటెన్ చేస్తూ ప్రభుత్వాలను ముచ్చెమటలు పట్టించాడు. దీంతో ఇతడి అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో నందిగామ గ్రామంలోని మిలీనియం టౌన్ షిప్ లోని ఓ వ్యక్తి ఇంట్లో ఉంటూ స్థానిక భూదందాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అనంతరం వారున్న స్థలానికి వెళ్లగా.. పోలీసులకు నయీం అనుచరులు కాల్పులు జరిపారు. ఆ తర్వాత పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో నయీం మృతి చెందాడు.ఐపీఎస్ వ్యాస్, మావోయిస్టు సాంబశివుడి వంటి వారి హత్య కేసులో నయీం ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. కాగా, నయీం మృతితో బాధితులంతా బయటకు వచ్చి ఫిర్యాదులు చేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేసు విచారణకు సిట్ ఏర్పాటు చేసింది. నయీంపై దాదాపు 250 కేసులు నమోదు చేయగా మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ రంగంలో దిగి దర్యాప్తు చేపట్టింది.

# మేడారంలో భగ్గుంటున్న ధరలు

వరంగల్, జనవరి 29, మేడారం జాతర ప్రారంభమైంది. వనదేవతల దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే, జాతర నేపథ్యంలో కొబ్బరికాయల నుంచి కోళ్లు, మేకల ధరలు, ఇళ్ల అద్దెల వరకు అన్నీ ఆకాశాన్నంటుతున్నాయి. స్థానికులు ఇళ్లలో కనీస వసతులు లేకున్నా అధిక మొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేయడం గమనార్హం. ఈ మూడు రోజులు ధరలు మరింత పెరుగుతాయంటున్నారు. పెరిగిన ధరలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ప్రారంభమైంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న వనదేవతల జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పక్క రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణ జాతరకు వెళ్లే భక్తుల కోసం టీజీఆర్టీసీ 4 వేల బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.దిలా ఉంటే జాతర నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొబ్బరికాయ మొదలు అమ్మలకు సమర్పించే బంగారం (బెల్లం), కోళ్లు, మేకల ధరలతో పాటు, ఇళ్లు, ప్రత్యేక గదుల అద్దెలను భారీగా పెంచి భక్తులను దోచుకుంటున్నారు. ఆఖరికి చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేస్తున్నారంటే జాతరలో దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో ఊహించవచ్చు.మేడారం జాతరలో భాగంగా భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి బంగారం (బెల్లం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పిస్తారు. ఇదే అదునుగా మేడారం జాతర వద్ద కోళ్లు, మేకల ధరలను భారీగా పెంచారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వెంట తీసుకురాలేక, జాతరకు వచ్చాక అక్కడే కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారులు ధరలను రెట్టింపు చేశారు.మేకపోతు లైవ్ కిలో రూ. 420 ఉండగా, మేడారంలో మాత్రం రూ. 900 నుంచి రూ. 1000 వరకు అమ్ముతున్నారు. మటన్ ధర రూ. 1500 వరకు పలుకుతోంది. బయట రూ. 170-180 కి దొరికే కిలో కోడిని జాతర దగ్గర రూ. 300-350 వరకు అమ్ముతున్నారు. మొన్నటి వరకు కూడా కిలో రూ. 350-400 ఉన్న నాటుకోడిని ఇప్పుడు రూ. 700లకు అమ్ముతున్నారు. జాతర చివరి మూడు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.ఇళ్ల అద్దెలు కూడా భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. కనీస వసతి సౌకర్యాలు లేకపోయినా సరే అద్దెలు ఆకాశాన్నంటాయి. ఆఖరికి చెట్ల నీడలో సేదతీరడానికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు ఉండటానికి ఇళ్లు వెతుకుతుండటంతో స్థానికులు భారీ మొత్తంలో అద్దెలు వసూలు చేస్తున్నారు. ఒక్క ఫ్యాన్ తప్ప మరే ఇతర సౌకర్యాలు లేని గదులకు కూడా రోజుకు రూ. 6 వేల వరకు వసూలు చేస్తున్నారు.గదులు దొరకని వారు చెట్ల నీడలో సేదతీరడానికి ప్రయత్నిస్తుండగా, తోట యజమానులు వాటికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. జాతరకు దగ్గరలో తోటలున్న స్థానికులు భక్తులకు చెట్లను అద్దెకు ఇస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడానికి ఒక్కో చెట్టుకు రూ. 1000 చొప్పున వసూలు చేస్తున్నారు.

# యూటర్న్ లో దానం...?

హైదరాబాద్, జనవరి 29, తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలలో ఏడుగురికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విషయం తేల్చాల్సి ఉంది. ఫిరాయింపులపై ఇదే లాస్ట్ ఛాన్స్ అని సుప్రీం కోర్టు ఇప్పటికే డెడ్‌లైన్ విధించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఈ ముగ్గురి లెక్క తేల్చే పనిలో పడ్డారు స్పీకర్.

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ ఈసారి కఠినమైన నోటీసుల జారీ చేశారు. ఏది ఏమైనా ఈనెల 30లోగా విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. పార్టీ ఫిరాయింపులపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. లేదంటే పార్టీ ఫిరాయించినట్లుగానే పరిగణించాల్సి ఉంటుందని పరోక్షంగా చెప్పారు. తాజా నోటీసులు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.స్పీకర్ తీర్మానం ప్రకారం, దానం నాగేందర్‌ను ఈ నెల 30 తేదీన విచారణకు కట్టుబడి హాజరు కావాలి. లేదంటే ఇది సభా నియమాల ఉల్లంఘనలకు సంబంధించిన చర్యగా కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే దానం నాగేందర్‌కు నోటీసులు పంపినట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పైచేయి సాధించింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ సాధిస్తామన్న ధీమాతో ఉంది. ఆ నమ్మకంతోనే దానంతో రాజీనామా చేయించే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తరహాలో దానంతో కాంగ్రెస్ టికెట్‌పై మళ్లీ పోటీ చేయించాలన్న ఆలోచన ఉన్నట్లు సమాచాం.ఇక దానం విచారణకు వస్తే అడ్డంగా దొరికిపోతారు. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన దానం.. లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేకుండానే కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఒక పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ మరో పార్టీ టికెట్‌పై పోటీ చేడయడం పార్టీ ఫిరాయింపు కిందకే వస్తుంది. దీంతో విచారణలో తాను బీఆర్ఎస్‌లో ఉన్నానని చెప్పి తప్పించుకునే అవకాశం లేదు.సుప్రీం కోర్టు డెడ్‌లైన్ నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ అధిష్టానం అన్నింటికి సిద్దపడ్డట్లు తెలుస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీని వీడలేదని వాదించడం ద్వారా అనర్హత వేటు పడకుండా చట్టపరమైన లొసుగులను వెతుక్కున్నట్లుగా కనిపిస్తోంది. దానం నాగేందర్ తన వివరణలో వినిపించిన అత్యంత కీలకమైన వాదన ఆయన వ్యక్తిగత హోదా . 2024 మార్చిలో తాను కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరైన మాట వాస్తవమేనని అంగీకరిస్తూనే, అది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, దానిని పార్టీ మార్పిడిగా పరిగణించలేమని ఆయన సమర్థించుకున్నారు. మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావించడం సరికాదని, చట్టపరంగా తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నానని ఆయన వాదిస్తున్నారు. పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు కూడా ఎలాంటి సమాచారం లేదని చెప్పడం ద్వారా, బంతిని మళ్ళీ బీఆర్ఎస్, స్పీకర్ కోర్టులోకి నెట్టారు. అయితే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న దృశ్యాలు, కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుండి లోక్‌సభకు పోటీ చేసిన రికార్డులు కళ్లముందే ఉన్నాయని బీఆర్ఎస్ నేతలంటున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకోవడం అనే నిబంధన దానంకు స్పష్టంగా వర్తిస్తుందని, ఎంపీగా కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడమే దానికి అతిపెద్ద నిదర్శనమని బీఆర్ఎస్ వాదిస్తోంది. ఈ పరిస్థితుల్లో దానం చేసిన వ్యక్తిగత హోదా వాదన కేవలం కాలయాపన చేసేందుకు ఆడుతున్న నాటకమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

మొదట దానంపై అనర్హత వేటు వేయకుండానే రాజీనామా చేయించే ఆలోచనలో ఉంది.

స్పీకర్ నోటీసుల నేపథ్యంలో దానం రేపో మాపో రాజీనామా చేసే అవకాశం ఉంది. దీంతో మరో ఆరు నెలల్లో ఖైరతాబాద్‌కు ఉప ఎన్నికలు రానున్నాయి. ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్టానం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## గంజాయి మత్తులో రౌడీ షీటర్ హల్ చల్

అనంతపురం గంజాయి మత్తులో వున్న రౌడీ షీటర్ హల్చల్ చేసాడు. గుంతకల్ టీడీపీ ఎమ్మెల్యే జయరాం స్టిక్కర్ ఉన్న వాహనంతో వీరంగం సృష్టించారు. యాడికి మండల కేంద్రంలో రౌడీషీటర్ అజయ్ గంజాయి మత్తులో వీరంగం సృష్టించాడు. టీడీపీ ఎమ్మెల్యే జయరాంకు సంబంధించిన స్టిక్కర్ ఉన్న కారును రోడ్డుపై అడ్డంగా పెట్టి, వాహనదారులను బెదిరిస్తూ హల్చల్ చేసాడు. తప్పించుకుంటుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. పోలీసులను చూసి అజయ్ గంజాయి ప్యాకెట్లు బయట పడేసాడు.

# రేవంత్ శాఖ నే టార్గెట్ చేసిన కోమటిరెడ్డి

నల్గొండ, జనవరి 29, తెలంగాణ రాజకీయాలలో సంచలనాలు అంతకంతకు చోటు చేసుకుంటున్నాయి. ఎప్పుడు ఎటువంటి పరిణామం జరుగుతుందో అర్థం కావడం లేదు. మంత్రుల నుంచి మొదలు పెడితే ప్రతిపక్ష నాయకుల వరకు ప్రతి ఒక్కరు ఏదో ఒక విధమైన కామెంట్లు చేస్తున్నారు. అవి కాస్త సోషల్ మీడియా నుంచి ప్రధాన మీడియా వరకు విపరీతంగా చర్చలో ఉంటున్నాయి.ఇటీవల కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై ఓ న్యూస్ ఛానల్ కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనం తెలంగాణ రాజకీయాలనే కాదు ఏకంగా ఏపీ రాజకీయాలను కూడా ప్రభావితం చేసింది. ఈ వ్యవహారంలోకి కొంతమంది మీడియా ప్రతినిధులు ప్రవేశించడంతో మరింత వివాదంగా మారింది. దీనిపై ఏకంగా ముఖ్యమంత్రి స్పందించడం.. ఉప ముఖ్యమంత్రి కలగజేసుకోవడం.. ఆ తర్వాత బొగ్గు టెండర్లను రద్దు చేయడం వంటి పరిణామాలు జరిగాయిఈ పరిణామాల కంటే ముందు కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కీలక వ్యాఖ్యలు చేశారు. తన మీద కక్ష తీరకపోతే.. ఇంత విషం పెట్టి చంపాలని ఆవేదనతో మాట్లాడారు. ఆయన మాట్లాడిన మాటలు ఒకరకంగా తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టించాయి. ఇప్పుడు వాటిని మర్చిపోకముందే కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోసారి తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు.కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్తుతం తెలంగాణ క్యాబినెట్లో కీలకమైన మంత్రిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఆయన తెలంగాణ విద్యా వ్యవస్థకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. " నేనే విద్యాశాఖ మంత్రిని అయితే కార్పొరేట్ పాఠశాలలను మూసి వేస్తాను. నారాయణ కాలేజీలో డిగ్రీ చేసిన వారు ఉంటే ప్రభుత్వ కాలేజీలలో పీహెచ్డీ చేసిన వారు ఉంటారు. ఏ ఉద్యోగం రాకుండా లక్షల ఉద్యోగం చేస్తున్నారు. బట్టీ పట్టిస్తే వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలి. విద్య అనేది వ్యాపారం కాదు. విద్యను వ్యాపారంగా మార్చడం సరికాదని" కోమటిరెడ్డి అన్నారు. మంగళవారం నల్గొండలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్న శాఖను ఉద్దేశించి కోమటిరెడ్డి ఆ వ్యాఖ్యలు చేయడంతో సహజంగానే రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది. కోమటిరెడ్డి మాట్లాడిన మాటలను గులాబీ మీడియా విపరీతమైన నెగిటివ్ ప్రచారం చేస్తోంది.. అయితే తాను చేసిన వ్యాఖ్యలను వేరే కోణంలో చూడవద్దని ఇప్పటికే కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పడం గమనార్హం.

# ఫోన్ ట్యాపింగ్ ఓ యాక్టింగ్

## బీజేపీ చీఫ్:రాంచందర్ రావు



హైదరాబాద్ జనవరి 29. ఫోన్ ట్యాపింగ్ కేసులో జరుగుతున్నది యాక్టింగ్ మాత్రమేనని యాక్షన్ తీసుకున్నదేమీ లేదని బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా తో మాట్లాడారు.హెచ్ఎండీఏ స్కాం, గొర్రెల స్కాం, జీఎస్టీ స్కాం, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలు, ధరణి భూదందా, ఫార్ములా ఈ రేస్ అక్రమాలు... ఇవన్నీ బీఆర్ఎస్ పాలనలో వెలుగులోకి వచ్చిన అతిపెద్ద కుంభకోణాలన్నారుకాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా, కేసీఆర్ కుటుంబానికి చెందిన ఒక్కరినీ, ఒక్క కీలక బీఆర్ఎస్ నాయకుడినీ జైలుకు పంపలేదని చెప్పారు.

పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు తెలంగాణను దోచిన కేసీఆర్ కుటుంబాన్ని చర్లపల్లి జైలుకు పంపుతాం" అని రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాళేశ్వరం స్కాం సహా అన్ని అవినీతి కేసులపై తన వద్ద ఆధారాలున్నాయని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదన్నారుప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతూ, తప్పుడు కేసులు బనాయిస్తోందని ఆయన ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల ఏ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరింది, ఎన్ని కమిషన్లు వచ్చాయి అనే అంశాలపై పూర్తిస్థాయి జ్యుడిషియల్ ఎంక్వైరీ జరగాల్సిందేనని డిమాండ్ చేశారు.కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం వంటి అన్ని అవినీతి కేసులపై సిట్టింగ్ జడ్జితో జ్యుడిషియల్ ఎంక్వైరీ జరగాలని బిజెపి డిమాండ్ చేస్తోందని తెలిపారు.త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయని ఈ సందర్భంగా బిజెపి లేదని కొందరు, బిజెపి మత పార్టీ అని మరికొందరు దుష్ప్రచారం చేస్తున్నారని

బిజెపికి పెరుగుతున్న ప్రజాధరణను అడ్డుకోవడానికే కాంగ్రెస్ – బీఆర్ఎస్ పార్టీలు ఇలాంటి నాటకాలు చేస్తున్నాయన్నారు గ్రామపంచాయతీ ఎన్నికల్లో గతంలో 163 సర్పంచ్ స్థానాలు మాత్రమే గెలిచిన బిజెపి, ఇటీవలి ఎన్నికల్లో సుమారు వెయ్యి సర్పంచ్‌లు, పదివేల వార్డు మెంబర్లు, 1200 ఉపసర్పంచ్ స్థానాలను గెలుచుకుంది. ఇది తెలంగాణలో బిజెపి క్రమేణా బలపడుతోందని స్పష్టంగా సూచిస్తోందని తెలిపారు.

రాష్ట్రంలో మాత్రం రేవంత్ ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై విచారణలో పూర్తిగా విఫలమైందని, నోటీసులకే పరిమితమై, ప్రధాన నిందితులను, అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్ కు చెందిన బడా నాయకులను అరెస్ట్ చేయడం లేదు. కేవలం కొంతమంది అధికారులపై చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటోందన్నారు

మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి చదువుల పేరుతో పాలన వదిలేసి అమెరికా పర్యటనకు వెళ్లారని తెలిపారు.మొత్తంగా పార్టీలు వేరు కావొచ్చు... బీఆర్ఎస్–కాంగ్రెస్ పార్టీల దోపిడీ విధానం ఒకటే. ప్రజలను మోసం చేయడంలో రెండూ ఒకేవిధంగా ఉన్నాయన్నారు అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ – బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పి, బిజెపిని గెలిపించాలని తెలంగాణ ప్రజలను ఆయన కోరారు.

# బావమరిది బొగ్గు స్కామ్‌ను కప్పిపుచ్చుకునేందుకే..

## రేవంత్ రెడ్డి నోటీసుల డ్రామా...

### సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింతా ప్రభాకర్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 29(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేళ్ల పాటు ప్రగతి పథంలో నడిపించిన మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత



కేసీఆర్ కు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇవ్వడాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింతా ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి చేసిన భారీ బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే మాజీ మంత్రి హరీష్ రావు కు నోటీసులు ఇచ్చారని అదే కుంభకోణంపై గట్టిగా నిలదీసినందుకే కేటీఆర్ కు కూడా నోటీసులు పంపారని చింతా ప్రభాకర్ గుర్తు చేశారు,ఇప్పుడు ఆ స్కాముల నుండి, తన చేతగానితనం నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు,ఎప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, రేవంత్ రెడ్డి అవినీతిని ఎత్తి చూపినా.. కేసులు, నోటీసుల పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేయడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆయన దుయ్యబట్టారు,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్లకు, కరప్షన్ కు అడ్డాగా మారిందని చింతా ప్రభాకర్  అన్నారు. కమీషన్ల కోసమే ముఖ్యమంత్రి, మంత్రులు కుమ్ములాటలకు దిగుతున్నారని, రోజుకొక స్కామ్ చేస్తూ రేవంత్ రెడ్డి అసలు సిసలైన కాంగ్రెస్ మార్క్ పాలనను కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు,గతంలో ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్ గా దొరికిన రేవంత్ రెడ్డి కేసీఆర్ గారికి నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు,కేసీఆర్ కేసులకు భయపడే వ్యక్తి కాదని, ఆయన తెలంగాణ కోసం చావు నోట్లో తలపెట్టి వచ్చిన ఉద్యమకారుడని గుర్తు చేశారు,రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా, కేసీఆర్ అనే శక్తిని ఏమీ చేయలేరని స్పష్టం చేశారు,ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, కేవలం ప్రతిపక్షాన్ని ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్నారని చింతా ప్రభాకర్ మండిపడ్డారు,కేసీఆర్ గారికి నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని, సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ ప్రజలు కేసీఆర్ కు అండగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని  హెచ్చరించారు.

# మారుతీకి చుక్కలు చూపిస్తున్న ప్రభాస్ ఫ్యాన్స్



హైదరాబాద్, జనవరి 29 సినీ సెలబ్రిటీలు పబ్లిక్ ఈవెంట్స్ లో మాట్లాడేటప్పుడు, ఆచి తూచి మాట్లాడాలి. సవాళ్లు విసరడం, అభిమానులకు లేని పోనీ ప్రమాణాలు చేయడం వంటివి మంచిది కాదు. గత ఏడాది 'వార్ 2' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ నాగవంశీ లేని పోనీ ప్రమాణాలు చేసి, యాటిట్యూడ్ తో మాట్లాడిన మాటలకు అతను ఎదురుకున్న పరిణామాలు ఎలాంటివో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రతీ ఒక్కరు చూసారు. దెబ్బకు ఇకపై నేను మైక్ అందుకోను అని చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు 'రాజా సాబ్' డైరెక్టర్ మారుతీ పరిస్థితి కూడా అంతే. ప్రభాస్ ఫ్యాన్స్ రోజుకి ఒక కొత్త ఐడియా తో మారుతీ చేత నరకం స్పెల్లింగ్ రాయిస్తున్నారు. 'రాజా సాబ్' చిత్రం ప్రభాస్ ని ఇష్టపడే ప్రతీ ఒక్కరికి నచ్చుతుంది. ఒకవేళ నచ్చకపోతే నా అడ్రస్ ఇస్తున్నాను, అంటూ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో అడ్రస్ చెప్పుకొచ్చాడు డైరెక్టర్ మారుతీ.ఇంత గట్టిగా చెప్పాడంటే సినిమా ఔట్పుట్ వేరే లెవెల్ లో వచ్చిందేమో అని అంతా అనుకున్నారు. కానీ తీరా చూస్తే ప్రీమియర్ షోస్ కి వెళ్లిన అభిమానులు తీవ్రమైన నిరాశతో ఇంటికి తిరిగొచ్చారు. డైరెక్టర్ మారుతీ పని తీరు పై కారాలు మిరియాలు నూరుతూ సోషల్ మీడియా లో మొదటి రోజు నుండి అతన్ని ట్యాగ్ చేస్తూ బూతులు తిడుతున్నారు ప్రభాస్ ఫ్యాన్స్. అంతే కాదు, అడ్రస్ కూడా ఇచ్చాడు కాబట్టి, అతని ఇంటికి నిన్న మొన్నటి వరకు లెటర్స్ గుట్టలు గుట్టలుగా పంపించారు. అక్కడితో ఆగకుండా వందల సంఖ్యలో స్విగ్గీ, జొమాటో వంటి యాప్స్ ద్వారా క్యాష్ ఆన్ డెలివరీ ఫుడ్ ఆర్డర్లు పెట్టారు. ఒక్కసారిగా ఇన్ని ఆర్డర్లు రావడం తో మారుతీ సిబ్బంది కంగుతిన్నారు. ఈ విషయాన్నీ మారుతీ కి తెలియజేయగా, నేను ఎలాంటి ఫుడ్ ఆర్డర్స్ పెట్టలేదని, వచ్చిన వాళ్ళను వెనక్కి పంపేయాలని చెప్పాడట.ప్రతీ రోజు ఈ ఫుడ్ ఆర్డర్ల వ్యవహారం మారుతీ సిబ్బంది కి పెద్ద తలనొప్పిగా మారిందట. ఇలా రోజుకి ఒక యాంగిల్ లో డైరెక్టర్ మారుతీ ని చిత్రహింసలకు గురి చేస్తున్నారు ప్రభాస్ ఫ్యాన్స్. ఇక్కడ అభిమానులు ఒక్కటి అర్థం చేసుకోవాలి, ఏ డైరెక్టర్ కూడా ఒక సినిమాని ఫ్లాప్ అవ్వాలని తియ్యరు, కచ్చితంగా సూపర్ హిట్ సినిమాని తియ్యాలి అనే ఆశతో , కసితో కష్టపడి పని చేస్తుంటారు. డైరెక్టర్ మారుతీ ఆరోజు ఆ రేంజ్ లో ఈ సినిమా గురించి చెప్పాడంటే, అతను తీసిన ఔట్పుట్ పై సంతృప్తి గా ఉన్నాడు. అది ఆయన నమ్మకం, అందుకే అంత గట్టిగా చెప్పాడు. కానీ ఆడియన్స్ కి ఆ చిత్రం నచ్చలేదు. ఒక్కోసారి ఇలా అవుతుంటాయి, అభిమానులు సీరియస్ గా తీసుకొని ఇలా చేయడం కరెక్ట్ కాదంటూ సోషల్ మీడియా లో విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు.

# అదే పేరుతోనే నన్ను సంభోధించండి

## సమంతా రిక్వెస్ట్



హైదరాబాద్, జనవరి 29 నాగ చైతన్య తో విడాకులు తర్వాత చాలా కాలం వరకు సింగిల్ లైఫ్ ని గడుపుతూ వచ్చిన సమంత, కొన్నాళ్ళకు రాజ్ నిడిమోరు అనే బాలీవుడ్ డైరెక్టర్ తో ప్రేమాయణం నడపడం, రీసెంట్ గానే అతన్ని ఒక గుడిలో పెళ్ళాడడం వంటివి జరిగింది. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' వెబ్ సిరీస్ షూటింగ్ సమయం లోనే వీళ్లిద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. కాలక్రమేణా ఆ స్నేహం కాస్త ప్రేమ గా మారడం, అది పెళ్లి వరకు దారి తియ్యడం జరిగింది. అయితే నాగ చైతన్య ని పెళ్లి చేయూస్కున్న వెంటనే 'సమంత అక్కినేని' గా పేరు మార్చుకున్న సమంత, ఇప్పుడు ఎందుకు మార్చుకోలేదు?, అంటే అలా పేరు మార్చుకోవడం ఈమెకు కలిసి రాలేదు కాబట్టి, ఇక మీదట అలాంటివి రిపీట్ చేయకూడదు అని అనుకుందా?, అసలు కారణం ఏంటి అని సోషల్ మీడియా లో పెద్ద ఎత్తున చర్చలు జరిగాయి.అయితే ప్రస్తుతం ఆమె నందిని రెడ్డి దర్శకత్వం లో 'మా ఇంటి బంగారం' అనే చిత్రం చేస్తోంది. ఈ సినిమాలో టైటిల్స్ పాడేటప్పుడు 'సమంత నిడిమోరు' అని పడుతుందట. ఆ సినిమా విడుదల తర్వాతే ఆమె సోషల్ మీడియా లో కూడా తన పేరు ని మార్చుకుంటుంది అట. ఇది అభిమానులకు స్వీట్ సర్ప్రైజ్ గా ఉండబోతుంది. సమంత క్రిస్టియన్ మతస్తురాలు అయినప్పటికీ, హిందూ దేవుళ్లను చాలా గట్టిగా నమ్ముతుంది. ఆమెకంటూ కొన్ని బలమైన సెంటిమెంట్స్ ఉన్నాయి. ఆ సెంటిమెంట్ కి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. మరోపక్క సమంత ఏమి చేసిన విమర్శించే వాళ్ళు, ఈ అంశం పై కూడా నెగిటివ్ కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు ఆమె అభిమానులు సమంత తీసుకున్న ఈ నిర్ణయం పై హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇకపోతే సమంత వెండితెర పై హీరోయిన్ గా కనిపించి చాలా రోజులే అయ్యింది. విజయ్ దేవరకొండ హీరో గా నటించిన 'ఖుషి' చిత్రం లోనే ఆమె చివరి సారిగా హీరోయిన్ గా కనిపించింది. ఆ సినిమా విడుదలై మూడేళ్లు కావొస్తుంది. రీసెంట్ గానే 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' అనే నిర్మాణ సంస్థని స్థాపించి 'శుభమ్' అనే చిత్రానికి నిర్మాతగా వ్యవహరించింది. గత ఏడాది విడుదలైన ఈ చిత్రం కమర్షియల్ గా మంచి సక్సెస్ అయ్యింది. ఇప్పుడు నందిని రెడ్డి తో ఆమె చేస్తున్న 'మా ఇంటి బంగారం' అనే లేడీ ఓరియెంటెడ్ చిత్రానికి కూడా సమంత నిర్మాతగా వ్యవహరిస్తోంది. ఇక మీదట రెగ్యులర్ హీరోయిన్ రోల్స్ కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలే చేస్తుందట సమంత. ఎక్కువగా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు, అప్పుడప్పుడు ఛాన్స్ దొరికితే విలన్ క్యారెక్టర్స్ చేయడానికి కూడా సిద్ధమేనట సమంత. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' లో ఆమె చేసిన విలన్ రోల్ కి ఎలాంటి రెస్పాన్స్ వచ్చిందో మనమంతా చూసాము, భవిష్యత్తులో కూడా అలాంటి రోల్స్ చేయడానికి రెడీ అట సమంత.

# మాజీ ఎమ్మెల్యే కందాళ సమక్షంలో బిఆర్ఎస్ లో చేరికలు

## గుర్రాలపాడులో గులాబీ జోరు!



**ఖమ్మం ప్రతినిధి జనవరి 29 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు గ్రామానికి చెందిన బొల్లం నాగయ్య  వారితో పాటుగా 38 కుటుంబాలు  మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి  సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మరియు ఎమ్మెల్సీ తాత మధుసూదన్ మాజీ డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం పాల్గొన్నారుఈ సందర్భంగా బొల్లం నాగయ్య మాట్లాడుతూ 0పార్టీ కోసం పనిచేసిన వారికి కాకుండా జంపింగ్ జిలానికే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తుందని అన్నారు ఇన్ని సంవత్సరాల నుంచి పార్టీకి కష్టపడిన నా కాకుండా జంపింగ్ జలానికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందని అభిప్రాయపడ్డాడు సిపిఎం టిడిపి బలపరిచిన బిఆర్ఎస్ అభ్యర్థిగా నేను పోటీ చేస్తున్నానని నా  గుర్తైనా కారు గుర్తుపై ఓటు వేసి గుర్రాలపాడు ప్రజలు నన్ను మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్  నాయకులు సిపిఎం టిడిపి నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు















**మేడారం ప్రజాబలం ప్రతినిధి:** గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క కుటుంబ సమేతంగా మేడారం సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు నిలవెత్తు బంగారాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం జాతరకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. భక్తులందరూ ప్రశాంతంగా అమ్మవార్లను దర్శించుకుని తిరిగి ఇంటికి చేరుకోవాలి. అమ్మవార్ల దయవల్ల అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

గురువారం నాడు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కూమార్ గౌడ్ కుటుంబ సమేతంగా మేడారం సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు నిలవెత్తు బంగారాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సమ్మక్క--సారక్క జాతరకు జాతీయ పండుగ గుర్తింపు కోసం కేంద్రానికి విజ్ఞప్తి : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువాల్ ఓరం మేడారం సమ్మక్క--సారలమ్మ ఆలయానికి చేరుకున్నారు**

**రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ దివాకర ఘన స్వాగతం పలికారు**

**డోలు--డప్పులతో ఘన స్వాగతం**

**ఆలయ ప్రాంగణంలో పూజారులు, అధికారులు కేంద్ర మంత్రులకు స్వాగతం పలికారు**



తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో సమ్మక్క--సారక్క జాతర ఇదేనని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భక్తుల సౌకర్యార్థం అనేక శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టిందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మేడారంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, సమ్మక్క--సారక్క జాతరను 'జాతీయ పండుగ'గా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రుల పర్యటనతో ఈ అంశం త్వరలోనే సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క--సారక్క జాతరను గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, మరో కుంభమేళాగా ఆయన అభివర్ణించారు.

ఈ మహాజాతర విజయవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన అధికారులు, సిబ్బంది మరియు సహకరించిన



మీడియా మిత్రులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇన్‌ఛార్జ్ మంత్రి పర్యవేక్షణలో కేవలం 90 రోజుల్లోనే ఆలయ అభివృద్ధి పనులు మరియు మౌలిక వసతులు పూర్తి చేసినట్లు తెలిపారు. సాధారణంగా నాలుగు రోజులపాటు జరిగే జాతరను, ఈసారి భక్తుల రద్దీ దృష్ట్యా విస్తృత ఏర్పాట్లతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఇప్పటివరకు జాతర ప్రశాంతంగా, సవ్యంగా కొనసాగుతోందని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, ఇతర జిల్లాల నుంచి వచ్చి సేవలందించిన సిబ్బంది మరియు సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గద్దెల పునర్నిర్మాణం సహా మౌలిక సదుపాయాల పనులు నిర్ణీత కాలంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. సమ్మక్క--సారక్క జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం కి విజ్ఞప్తి చేసినట్లు, అలాగే జాతర నిర్వహణకు మరింత ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ కేంద్ర మంత్రులకు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

లక్షలాది మంది భక్తులు హాజరవుతున్న ఈ మహాజాతరలో వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంటూ, జాతర విజయవంతానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు మరియు మీడియా మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## సమ్మక్క-సారక్క జాతర గిరిజనుల మహాకుంభం : కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం



మేడారం సమ్మక్క--సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిజువల్ ఓరం, కేంద్ర బొగ్గు & గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రత్యేకంగా ఆలయాన్ని సందర్శించి సమ్మక్క--సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ డోలు--డప్పుల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు.

తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ,

"సమ్మక్క--సారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పవిత్ర జాతరకు రావడం ఆనందంగా ఉంది" అని అన్నారు.

ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు అందిస్తోందని తెలిపారు. జాతర నిర్వహణకు సహకరిస్తూనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తనకు పాత మిత్రులని, పార్లమెంటులో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు.

గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

ధర్తీ ఆబా గిరిజన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద ?1 లక్ష కోట్లు

పీఎం జన్-మన్ యోజన కింద ?24,000 కోట్లు



తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు

అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో గిరిజన వ్యవహారాల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటై, తొలి క్యాబినెట్ మంత్రిగా తాను బాధ్యతలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. భగవాన్ బిర్సా ముండా వంటి గిరిజన వీరుల త్యాగాలను దేశం గౌరవిస్తోందని అన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ,

"సమ్మక్క--సారక్క జాతర గిరిజన ప్రజల అతిపెద్ద పండుగ. నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు ఇక్కడికి వస్తారు" అని తెలిపారు. జాతర ఏర్పాట్లలో భాగస్వాములైన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ములుగు, లక్నవరం, మేడవరం, తాడ్వాయి, బొగత జలపాతం ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి ?80 కోట్లు

రామప్ప దేవాలయ అభివృద్ధికి 140 కోట్లు

ఈ ఏడాది జాతర నిర్వహణకు 3.70 కోట్లు మంజూరు

సమ్మక్క--సారక్క పేరుతో 890 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుందని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. త్వరలో ప్రధాని చేతుల మీదుగా ప్రారంబించు కుంటామని వెల్లడించారు.

లక్షలాది మంది వచ్చే ఈ మహాజాతరలో భక్తులకు కనీస వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

# ముద్రణలో నిబంధనలు తప్పనిసరి:

## జిల్లా కలెక్టర్ రాజార్షి షా




**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఎన్నికల ప్రక్రియలో భాగంగా ముద్రణ పనులు చేపట్టేటప్పుడు ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకులు డి.హనుమంత్ నాయక్, అదనపు కలెక్టర్లతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కరపత్రంపై వివరాలు ఉండాలన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి ముద్రించే ప్రతి పోస్టర్, కరపత్రం లేదా బ్యానర్‌పై ముద్రణదారుడు, ప్రచురణకర్త పేర్లు, చిరునామాలు స్పష్టంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఒకవేళ ఈ వివరాలు లేకుండా ముద్రిస్తే వాటిని చట్టవిరుద్ధంగా పరిగణించి, సంబంధిత ప్రెస్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పర్యవేక్షించేందుకు వీలుగా ముద్రణ వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. ఎన్ని కాపీలు ముద్రించారు, దానికి అయిన ఖర్చు ఎంత అనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు నివేదించాలని సూచించారు. ప్రచురణకర్త నుంచి ముందస్తుగా నిర్ణీత నమూనాలో డిక్లరేషన్ తీసుకున్న తర్వాతే ఆర్డర్లు స్వీకరించాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, శ్యామలాదేవి, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి:

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ (ఫీూ), స్టాటిక్ సర్వైలెన్స్ (ాూ) బృందాల సభ్యులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డి. హనుమంత్ నాయక్‌తో కలిసి ఆయన పాల్గొని పలు కీలక సూచనలు చేశారు.ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో ఫీూ, ాూ బృందాల పాత్ర కీలకమని తెలిపారు. నగదు, మద్యం, బహుమతుల పంపిణీపై నిరంతర నిఘా ఉంచాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. ప్రతి తనిఖీని వీడియో రికార్డు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. శిక్షణ అనంతరం ఫీూ, ాూ బృందాల కోసం కేటాయించిన వాహనాలను కలెక్టర్, సాధారణ పరిశీలకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనాలు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.




**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** నార్నూర్ మండలం ఖైర్ డాట్వా గ్రామానికి చెందిన పేందూరు శాంతాబాయి గిరిజన మోహవ లడ్డు యూనిట్ సభ్యురాలి స్థాపించినందుకుగాను గణతంత్ర వేడుకల్లో గౌరవ రాష్ట్రపతి భవన్, ఢిల్లీ నుండి వచ్చిన ఆహ్వానం మేరకు హాజరై ప్రశంసాపత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమెను జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎన్నికల సాధారణ పరిశీలకులు హన్మంత్ నాయక్ శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామంలోని 20 మంది మహిళలు కలిసి శిక్షణ పొందారని, గత సంవత్సరం ఆగస్టు 1 న యంత్రాలతో కూడిన యూనిట్ను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం నెలకు ఖర్చులు పోను ఒక్కొక్కరికి 5000/- రూపాయలు ఆదాయం రావటం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసామని చెప్పి రాష్ట్ర ప్రజలను జగన్ మోసం చేశారు : మంత్రి నిమ్మల రామానాయుడు

జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వెలిగొండ ప్రాజెక్టును 2026 కల్లా పూర్తి చేయాలనే గట్టి సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని, దానికి అనుగుణంగానే పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నిమ్మల పేర్కొన్నారు.గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని మంత్రి విమర్శించారు. ప్రాజెక్టు పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. హెడ్ రెగ్యులేటర్ పనులు, టన్నెల్-1 మరియు టన్నెల్-2 పనులు, బెంచింగ్ మరియు లైనింగ్ పనులు ఇంకా పూర్తి కాలేదని ఆయన వివరించారు. టన్నెల్‌లో ఒక బోరింగ్ మెషిన్ చిక్కుకుపోయి ఉందని, కోర్టు స్టే ఆర్డర్ల వల్ల అది అక్కడే నిలిచిపోయిందని, అది తొలగించకుండా నీటిని ముందుకు పంపడం అసాధ్యమని మంత్రి పేర్కొన్నారు. నిర్వాసితులకు గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా వారికి ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. అసంపూర్తిగా ఉన్న పనుల కోసం ప్రస్తుతం ప్రభుత్వం ?456 కోట్లు విడుదల చేసిందని, సీసీ వాల్స్, లైనింగ్ పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. ప్రకాశం జిల్లాకు అన్యాయం: జగన్ మోహన్ రెడ్డి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశారని, ప్రాజెక్టు పూర్తి కాకుండానే అయిపోయిందని అబద్ధాలు చెప్పి జాతికి అంకితం చేయడం హాస్యాస్పదమని మంత్రి అన్నారు. వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యేలే ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కోసం మరిన్ని నిధులు కావాలని కోరుతుండటమే గత ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు.

# మీడియా మాధ్యమాల్లో వచ్చే ఎన్నికల వార్తలపై నిఘా ఉంచాలి:

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

### డీపీఆర్వో కార్యాలయంలో మీడియా సెంటర్ ప్రారంభించిన కలెక్టర్.



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మాధ్యమాలలో వచ్చే రాజకీయ వార్తలపై పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్లోని డిపిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేట్ అండ్ మానిటరింగ్ కమిటీ (మీడియా సెంటర్) ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్ తో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.

డిపిఆర్ఓ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ కు డిపిఆర్ఓ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోజువారీగా వార్త పత్రికలు, లోకల్ చానళ్లలో వచ్చే వార్తలను ప్రతిరోజు నిశితంగా గమనిస్తూ ఉండాలని అన్నారు. అనుమానిత పెయిడ్ న్యూస్ వివరాలు నమోదు చేయాలని అన్నారు. అన్ని రకాల రిజిస్టర్లను జాగ్రత్తగా నమోదు చేయాలని పేర్కొన్నారు. వివిధ రకాల సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై నిఘా ఉంచాలని తెలిపారు.



ఈ మీడియా సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎవరైనా 9100577132 నంబర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని సూచించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి ఫోన్ కాల్‌ను సిబ్బంది స్వీకరించాలని, ఫిర్యాదుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఎటువంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఈడీఎం నదీమ్, కంట్రోల్ రూమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలు ఆకాశమే హద్దుగా ఎదగాలి

## బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడమే మన లక్ష్యం

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించిన అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆమె ఆసక్తిగా తిలకించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి సమాజంలో బాలికలు బాలురతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని కొనియాడారు. చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక రంగాల్లోనూ బాలికలు అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, తమకు ఇష్టమైన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని కేజీబీవీలు, వసతి గృహాల్లో విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పిస్తూ వారి మేధోవికాసానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, బాలికలకు చిన్నతనం నుంచే సరైన ప్రోత్సాహం అందిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థినుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

అనంతరం...వివిధ పనుల నిమిత్తం చంటి పిల్లలతో కలెక్టరేట్‌కు వచ్చే మహిళా సందర్శకుల సౌకర్యార్థం ప్రజావాణి హాలు సమీపంలో ఏర్పాటు చేసిన 'బేబీ ఫీడింగ్ రూమ్' (తల్లులు పాలు ఇచ్చే గది)ను కలెక్టర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యాలయాలకు వచ్చే తల్లులకు ఇబ్బంది కలగకుండా ఈ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వాహిద్, డీఈఓ భోజన్న, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, సీడీపీఓలు, ఉపాధ్యాయులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సదాశివపేటలో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థుల జాబితా విడుదల...

## సదాశివపేట మున్సిపాలిటీలో పోటీ చేసే కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థుల జాబితా విడుదల చేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 29(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సదాశివపేట మున్సిపాలిటీకి సంబంధించి కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేసింది.మొత్తం 26 వార్డులకు గాను, 25 వ వార్డులకు పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలను అధికారికంగా వెల్లడించారు. పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు , టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి ఆంజనేయులు,సీడీసీ చైర్మన్ రాంరెడ్డి ,సదాశివ పేట పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ,కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు.

వార్డుల వారీగా అభ్యర్థులు :

వార్డు 1: పిల్లోడి విశ్వనాథం
వార్డు 2: ఎరుకల నర్సింహులు
వార్డు 3: రేణుక
వార్డు 4: ఎండీ. మోయిజ్
వార్డు 5: ఖుతేజా ఫాతిమా
వార్డు 7: పాతదొడ్డి అనిత
వార్డు 8: సిహెచ్. రేణుక
వార్డు 9: బి. అరుణ్ కుమార్
వార్డు 10: కంది నర్సింహులు గౌడ్
వార్డు 11: గోపి ప్రియాంక
వార్డు 12: పులిమామిడి మమత
వార్డు 13: పిల్లోడి భవాని
వార్డు 14: రాయపాడు స్వరూప
వార్డు 15: గౌసియా బేగం
వార్డు 16: కొత్తగొల్ల చంద్రశేఖర్
వార్డు 17: ఎండీ. షాజీ
వార్డు 18: ఆకుల నిఖిత
వార్డు 19: పట్లూరి రోజా
వార్డు 20: మునిపల్లి అంజమ్మ
వార్డు 21: ఎండీ. వాజీద్
వార్డు 22: పతనం విజయ లక్ష్మి
వార్డు 23: వానగంటి లక్ష్మి ప్రియ (ముగిటి లక్ష్మి ప్రియ)
వార్డు 24: ఎండీ. కలీమ్
వార్డు 25: కే. శంకర్ గౌడ్
వార్డు 26: కావులే హారిక
(6వ వార్డు అభ్యర్థి ఎవరనేది పెండింగ్‌లో ఉంది)

# నామినేషన్ ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 29 :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మండల తహసిల్దార్ దిలీప్ కుమార్,మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్,మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ...2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని,లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని,30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్నవారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారి నుండి స్వీకరించడం జరగదని తెలిపారు.నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, 100 మీటర్ల నిబంధన అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు,ఫిర్యాదుల స్వీకరణ,2వ తేదీన అభ్యంతరాలు,ఫిర్యాదుల పరిష్కారం,3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే),13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కొండ బాల, మల్లి బాబు యాదవ్



**ఖమ్మం ప్రతినిధి జనవరి 29 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా చింతకాని మండలం బస్వాపురం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు సోమ నాగేశ్వరరావు మాతృమూర్తి సోమ శేషమ్మ ఇటీవల వృద్ధాప్య కారణాలతో అనారోగ్యంతో మరణించడంతో గురువారం నాడు జరిగిన వారి దశదిన కర్మ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి, జిల్లా అఖిల భారత యాదవ మహాసభ గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి పాల్గొని శేషమ్మ గారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మనం ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ, మనకు బాధ కలిగితే ఒక్క తల్లి మనసు మాత్రమే తల్లడిల్లి పోతుంది. అలాంటి మాతృమూర్తి మరణం, ఆ కుటుంబానికి తీరని లోటుగా మిగిలించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు కుటుంబాన్ని. ఈ కార్యక్రమంలో సోమ సత్యనారాయణ, బుర్ర ముత్తయ్య, సయ్యద్ ఉస్మాన్, అమరయ్య నరసింహారావు, శ్రీకాంత్, నాగరాజు షాజహాన్, వెంకట రామారావు కొండలరావు, రాంబాబు బంధువులు మరియు తదితరులు పాల్గొన్నారు

# నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 29 :** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని,30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్న వారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారిని అనుమతించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని,నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు,ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.నామినేషన్ దరఖాస్తులు పూర్తి చేసిన అభ్యర్థులు హెల్ప్ డెస్క్ వద్ద పరిశీలించుకుని సరైన నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు.31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు,ఫిర్యాదుల స్వీకరణ,2వ తేదీన అభ్యంతరాలు,ఫిర్యాదుల పరిష్కారం,3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే),13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెయిన్ రోడ్డు పై కొత్తగా సిసి రోడ్ వేసి మధ్యన విద్యుత్ స్తంభాలుతొలగించకపోవడంతో ప్రమాదాలు




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 29 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** ఆందోల్ -జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో, హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద, మెయిన్ రోడ్లపై సిసి రోడ్లు వేస్తున్నప్పటికీ, మధ్యలోకి విద్యుత్ స్తంభాలు వస్తున్నాయి, స్తంభాల పక్కన దాదాపు, 8, పీట్ల రోడ్డు వేస్తున్నారని, మధ్యలో స్తంభాలు తొలగించకపోవడం వల్ల, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కాలనీవాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన, పట్టించుకోవడంలేదని అన్నారు, ఈ దారి గుండ రోజు ఆర్టీసీ బస్సులు,, కొన్నివేల ద్విచక్ర, వాహనాలు, ఆటోలు,కార్లు, తిరుగుతాయని, వెంటనే సంబంధిత అధికారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, స్పందించాలని స్థానికులు కోరుతున్నారు......

# పార్కుల ప్రహరీపై కంచె ఏర్పాటు చేయండి.

## కమిషనర్ ఎన్.మౌర్య.

పార్కుల్లోని ప్రహరీ గోడలు ఎక్కి ఇతరులు లోనికి రాకుండా పెన్సింగ్ (ఇనుప కంచె) ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా పిర్యాదుల పరిష్కారంలో భాగంగా గురువారం ఉదయం 18 వ వార్డులోని రాయల్ నగర్ లోని తుడా పార్కు, ఆర్.సి.రోడ్డు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఇంజినీరింగ్, హెల్త్ అధికారులతో కలసి పరిశీలించారు. తుడా పార్కు ప్రహరీ గోడలను ఎక్కి ఇతరులు లోనికి వస్తున్నారని పిర్యాదు చేశారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ పార్కు ప్రహరీ గోడలపై ఇనుప కంచె ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైల్వే ట్రాక్ కాలువ వెంబడి ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించి శుభ్రంగా ఉంచాలన్నారు. డ్రైనేజి కాలువలను శుభ్రం చేసి, చెత్త ను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆర్.సి.రోడ్డు అండర్ బ్రిడ్జి వద్ద కుంచించుకు పోయిన మ్యాన్ హోల్ ఇనుప గేట్ సరిచేయాలని తెలిపారు. తెలుగుగంగ పైప్ లైన్ మారమ్మత్తులు చేసి నీటి వృధాను అరికట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కుటుంబ సమగ్ర సమాచార సర్వేని వేగవంతం చేయాలని స్వర్ణ వార్డు కార్యదర్సులను ఆదేశించారు. కమిషనర్ వెంట తుడా ఈ.ఈ. రవీంద్ర, మునిసిపల్ ఇంజనీర్ తులసికుమార్, డి.ఈ.నరేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, మాజీ కౌన్సిలర్ దంపూరి రాజ్యలక్ష్మి, కార్యదర్సులు, తదితరులు ఉన్నారు.

# ఆందోల్ -జోగిపేట మున్సిపాలిటీకి మొదటి రోజు 18 నామినేషన్లు




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 29 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా,,:** ఆందోల్ -జోగిపేట, మున్సిపాలిటీకి, ఎన్నికల సందర్భంగా, నామినేషన్లు బుధవారం18, నామినేషన్లు దాఖలు అయినట్లు, కమిషన్ ఏ,రవీందర్, తెలిపారు, మున్సిపల్ పరిధిలో 20, వార్డుల గాను కాంగ్రెస్ అభ్యర్థులుగా7, బిజెపి అభ్యర్థులుగా, 7, బిఆర్ఎస్ అభ్యర్థులుగా 4, నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు....

## మంత్రి దామోదర్ హయాంలో అభివృద్ధి పనులు పరుగులు

### రూ,239.7, కోట్లతో దూసుకుపోతున్న అభివృద్ధి పనులు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 29 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా,,:** ఆందోల్ -జోగిపేట మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పరుగులు పెడుతుంది, దామోదర్ రాజనర్సింహ, బాధ్యతలు చేపట్టిన అనంతరం, జోగిపేట అభివృద్ధికి చిరునామాగా మారింది, తెలంగాణ సాధించిన తర్వాత రెండు పర్యాయాలు, పరిపాలన కొనసాగిన ప్రభుత్వంలో, జరగని అభివృద్ధి, దామోదర్ రాజనర్సింహ, హయాంలో, ఏడాది పాలనలో అభివృద్ధి జరిగిందని చెప్పవచ్చు, జోగిపేటకు, పూర్వ వైభవం తీసుకురావాలనె సంకల్పంతో, దామోదర్ రాజనర్సింహ, కృషి చేస్తున్నారు, జోగిపేట పట్టణం నుంచి, మంజీరా నది మీదుగా, నర్సాపూర్ నియోజకవర్గాన్ని కలుపుతూ,రూ, 80, కోట్ల నిధులతో, నూతన రోడ్డు వంతెన నిర్మాణ పనులు, కొనసాగుతున్నాయి, పట్టణంలో గతంలో నిర్మించిన, బైపాస్ రోడ్డుని కలుపుతూ, రిక్షా కాలనీ గుండా, అంబేద్కర్ చౌరస్తా మధ్యరంగం మీదుగా, దాకూర్ అండర్ పాస్ బ్రిడ్జి వరకు, రోడ్డు వెడల్పు చేస్తూ, రవాణా సౌకర్యం పెంచేందుకు పనులు ప్రారంభించారు, జోగిపేట పట్టణానికి రాకపోకలు పెరగాలని ఉద్దేశంతో, సంగుపేట, నుంచి అన్న సాగర్, వరకు రూ,20, కోట్లతో విశాలమైన రోడ్లు, మరియు సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించారు, పనులు చివరి దశకు చేరుకున్నాయి,రూ, 2,31, కోట్లతో పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో, మార్చురీ, బిల్డింగ్ సిసి రహదారులు, ఎక్స్టర్నల్ డ్రైనేజీ, అండ్ టాయిలెట్స్ రిపేరు, ప్రహరీ గోడ నిర్మాణం, ఆక్సిజన్ పైపు లైనింగ్ సిస్టం రిపేరింగ్ పనులు కొనసాగుతున్నాయి, ఆందోల్ లో ప్రధాన రహదారి పక్కన రూ, 60, కోట్లతో ఆస్పత్రి భవన నిర్మాణం,రూ, 43 కోట్ల నిధులతో నర్సింగ్ కాలేజ్ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి,, విద్యా (రంగానికి పెద్ద పెట వేశారు )రూ 5,39 నిధులతో నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాల కాంపౌండ్ వాల్, జూనియర్ కాలేజీ, మహిళా పాలిటెక్నిక్ కాలేజీలకు, కాంపౌండ్ వాల్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజ్ కేజీబీవీలో మహిళా డిగ్రీ కాలేజీ ప్రహరీ గోడలు అంతర్గత రహదారులు, టాయిలెట్స్ వంటి పనులు కొనసాగుతున్నాయి,రూ, 20, కోట్లతో, ఎంఈఓ ఎంపీడీవో, (ఆర్ డబ్ల్యూ ఎస్ ) పంచాయతి రాజ్ కార్యాలయాలు కలుపుతూ ఇంటిగ్రేటెడ్ ఆఫీసుల సముదాయానికి నిధులు మంజూరు అయ్యాయి...



## మహిళలు స్వశక్తితో ఎదగాలి




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జనవరి 29:**మహిళలు స్వశక్తి తో ఎదిగేలా ప్రయత్నం చేయాలని లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ అధ్యక్షుడు లయన్ చంద్రమోహన్ నరేసేపల్లి పేర్కొన్నారు. నాచారం లో వీర సావర్కర్ నగర్ కమ్యూనిటీ హాల్ లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీర సావర్కర్ నగర్ కాలనీ అసోసియేషన్ సహకారం తో మహిళలకు మూడు నెలలపాటు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ అందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ తో పాటు 50 శాతం సబ్సిడీ తో 26 కుట్టుమిషన్ లను అందించారు. లయన్స్ క్లబ్ నాచారం సాకారంతో 6 కుట్టుమిషన్ లను అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు స్వశక్తి ఆర్థికంగా ఎదగాలని కుటుంబానికి తోడ్పాటు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్ పర్సన్ ప్రకాష్, ప్రాజెక్ట్ కో ఛైర్మెన్ ప్రవీణ్ కుమార్, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ కోశాధికారి లయన్ విజేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ నాచారం సభ్యుడు నందికొండ శ్రీనివాస్ రెడ్డి, వీర సావర్కర్ నగర్ అధ్యక్షుడు వేంకట రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొగ్గారపు రమేష్, లయన్స్ క్లబ్ నాచారం సభ్యులు పాల్గొన్నారు




## టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఫోరం టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ

### ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం




**ఖమ్మం ప్రతినిధి జనవరి 29 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్‌ను (GGH)జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్డెంట్ ఆవిష్కరించారు ఈ క్యాలెండర్‌లో ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా పబ్లిక్ హాలిడేస్ మరియు ఆప్షనల్ హాలిడేస్ వివరాలను పొందుపరచడం పట్ల అధికారులు ఫోరం నాయకత్వాన్ని అభినందించారు ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్జీవోస్ ఎల్లప్పుడూ ముందుంటుందని యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు పెండింగ్ సమస్యలు: రాష్ట్ర నాయకత్వం నిరంతరం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోందని, త్వరలోనే ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ా=జ మరియు జు=ూ (హెల్త్ కార్డుల) సమస్యలు పరిష్కార మవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు ప్రభుత్వ సానుకూలత: ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే సానుకూల నిర్ణయాలు వస్తాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ కార్యదర్శి జైపాల్ మెడికల్ అండ్ హెల్త్ ఫోరం అధ్యక్షులు సైదులు, సెక్రటరీ లావణ్య మరియు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




## బీఆర్ఎస్, సీపీఎం పొత్తులో పోటీ చేసే అభ్యర్థులను ఆశీర్వదించండి మాజీ ఎంపీ నామ

### అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది మాజీ ఎంపీ నామ

### పదేళ్ల కేసీఆర్ పాలనలోనే పట్టణాలు, పల్లెలు అభివృద్ధి జరిగాయి మాజీ ఎంపీ నామ

### రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం లో జరిగిన అభివృద్ధి శూన్యం మాజీ ఎంపీ నామ







**ఖమ్మం జనవరి 29 ( ప్రజాబలం బ్యూరో)** ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలోని వైరా పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, వైరా మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమంలో గురువారం నాడు బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ, బీఆర్ఎస్,సీపీఎం పార్టీల పొత్తుతో పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన విమర్శించారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచేందుకు ‘బాకీ కార్డు’తో ప్రజల్లోకి వెళ్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను బాకీ కార్డుతో నిలదీయాలని ప్రజలకు సూచించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో పట్టణాల్లో అభివృద్ధి శూన్యమని, కేసీఆర్ పాలనలోనే పట్టణాలు, పల్లెలు సమగ్రంగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతే బీఆర్ఎస్ పార్టీ విజయానికి కారణమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో వైరా పట్టణం గణనీయంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో విద్యుత్ కోతలతో దుకాణాల ముందు జనరేటర్లు ఉండేవని, కేసీఆర్ పాలనలో కరెంట్ కోతలు లేకుండా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్య, వైద్యం, తాగునీరు, సాగునీటి రంగాల్లో విస్తృత అభివృద్ధి జరిగిందని నామ తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ శాసనసభ్యులు బానోత్ చంద్రావతి, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం పార్టీ డివిజన్ సెక్రటరీ వీరభద్రం, నియోజకవర్గ నాయకురాలు బానోత్ మంజుల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు, వైరా రూరల్, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, వనమా వీశ్వేశ్వరరావు గారు, బీఆర్ఎస్ ఖమ్మం కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, రఘునాథపాలెం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వీరునాయక్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, ముత్యాల వెంకట అప్పారావు, వైరా జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు షేక్ లాల్ మొహమ్మద్ పట్టణ మహిళా అధ్యక్షురాలు బానోత్ సక్కుబాయి, మాజీ కౌన్సిలర్లు, వైరా పట్టణ, రూరల్ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## TSSA టేబుల్ క్యాలండర్ ఆవిష్కరణ

### TSSA ఖమ్మం జిల్లా టేబుల్ క్యాలండర్‌ను ఆవిష్కరించిన TNGOs జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు

**ఖమ్మం ప్రతినిధి జనవరి 29 (ప్రజాబలం)** ఖమ్మం తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ (TSSA) ఖమ్మం జిల్లా కమిటీ రూపొందించిన







టేబుల్ క్యాలండర్‌ను TNGOs యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు గురువారం ఘనంగా ఆవిష్కరించారు ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు యువతలో సామాజిక స్పృహను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, TSSA నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయం అని పేర్కొన్నారు ఈ క్యాలండర్ ఆవిష్కరణ విద్యార్థి సంఘాలకు మరింత ఉత్సాహాన్ని అందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారుNGOs యూనియన్ నాయకులు పాల్గొని విద్యార్థి సంఘాల సేవలను అభినందించారు ఈ కార్యక్రమంలో TNGOs రాష్ట్ర కార్యదర్శి ్ర.ా.జైపాల్ TNGOsµ జాయింట్ సెక్రెటరీలు తాళ్లూరి శ్రీకాంత్ , బుస చంద్రశేఖర్ , హాస్టల్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు , మెడికల్ ఫోరం జిల్లా అధ్యక్షులు సి.హెచ్. సైదులు, టీఎన్జీవోస్ నాయకులు కె.విజయ్, TSSA రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ళ సత్యం, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఫైర్ సేఫ్టీపై హైడ్రా తనిఖీలు షురూ

## -జూబ్లీహిల్స్‌లో నీరూస్ షోరూమ్ సీజ్

## -నాంపల్లి స్టేషన్ రోడ్డులో ఫర్నీచర్ షోరూంకు తాళం



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** నగరంలో షాపులతో పాటు వాణిజ్య సముదాయాల్లో హైడ్రా తనిఖీలు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36లో ఉన్న నీరూస్ షోరూంను గురువారం తనిఖీ చేశారు. మూడు సెల్లార్లు, నాలుగు అంతస్తులకు తోడు.. పైన అనుమతి లేని రూఫ్ షెడ్డు వేసి వస్త్రాలతో నింపేయడాన్ని హైడ్రా కమిషనర్ సీరియస్‌గా పరిగణించారు. రెండు అంతస్తుల్లో అమ్మకాలు, పైన మూడు అంతస్తుల్లో వస్త్రాల తయారీ, గోదాములా పెద్దమొత్తంలో నిలువలు ఉంచడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైర్ ఎన్వోసీ లేకుండా షాపులను నిర్వహిస్తున్నట్టు నిర్ధారించుకున్నారు. ఫైర్ నిబంధనలను పాటించకపోవడమే కాకుండా.. ఫైర్ ఎక్స్టింగ్విషర్ (మంటలను ఆర్పేది) లు కూడా సరిగా లేకపోవడాన్ని గమనించారు. ఇలా ప్రతి విషయంలోనూ ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడంతో సీజ్ చేయాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. హైడ్రా, ఫైర్, జీహెచ్ ఎంసీ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు ఈ తనిఖీల్లో ఉన్నారు. ఫైర్ అన్ సేఫ్ షాపుగా పేర్కంటూ బోర్డులను ఏర్పాటు చేయడమే కాకుండా.. హైడ్రా ఫెన్సింగ్ వేసింది. విద్యుత్ అధికారులు పవర్ సప్లైను బంద్ చేశారు.



**-నాంపల్లిలోని ఫర్నీచర్ షోరూంకూ తాళం..**

నాంపల్లి స్టేషన్ రోడ్డులో గత శనివారం బచ్చాస్ ఫర్నీచర్ షోరూంలో అగ్ని ప్రమాదం సంభవించడం.. ఐదుగురు మృతి చెందిన ఘటన తర్వాత కూడా అదే రోడ్డులో ఉన్న దుకాణ దారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా పరిగణించారు. నాంపల్లి స్టేషన్ రోడ్డులో రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నీచర్ దుకాణం ఉన్న భవనం 6 అంతస్తులుండగా.. సెల్లార్‌తో పాటు..




మొత్తం అన్ని అంతస్తుల్లో భారీగా ఫర్నీచర్ నిలువలుంచడం.. మెట్ల మార్గాన్ని కూడా మూసేసిన విధంగా స్టాక్ పెట్టడం పట్ల హైడ్రా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైర్ ఎన్‌వోసీ లేకపోవడంతో పాటు.. 6 అంతస్తుల్లో ఎక్కడా ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కనిపించకపోవడాన్ని సీరియస్‌గా పరిగణించారు. మొత్తం 6 అంతస్తులు తనిఖీ చేసి.. ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఎక్కడా కానరాకపోవడంతో సీజ్ చేయాలని ఆదేశించారు. ఈమేరకు హైడ్రా, జీహెచ్ ఎంసీ, ఫైర్ విభాగంతో పాటు విద్యుత్ శాఖకు చెందిన అధికారులు చర్యలు తీసుకున్నారు. వెంటనే విద్యుత్ సరఫరా ఆపేశారు. ఆ భవనంలో వ్యాపార లావాదేవీలు జరగకుండా నిలిపేశారు.

**-7207923085 నంబరుకు ఫిర్యాదు చేయండి..**

ఫైర్ నిబంధనలు ఉల్లంఘించినట్టు ఎవరైనా గమనిస్తే.. హైడ్రా కంట్రోల్ రూమ్ 9000113667 నంబరుతో పాటు.. నేరుగా తన నంబరు 7207923085 కు సమాచారం ఇవ్వాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నగర ప్రజలను కోరారు. షాపులను గోదాములుగా మార్చేసి వారి వ్యాపార వస్తువులను అందులోనే నిలువలుంచడం, సెల్లార్లలో భారీ మొత్తంలో అగ్ని ప్రమాదానికి కారణమైన వస్తువులు పెట్టినట్లయితే సంబంధిత షాపు, వ్యాపార సముదాయాల వివరాలతో పాటు.. ఏ ప్రాంతంలో ఉన్నదీ స్పష్టంగా పేర్కంటూ వాట్సాప్ ద్వారా, ఫొటోలు, వీడియోలు పంపాలని సూచించారు. Commissioner_HYDRAA పేరిట ఉన్న ఎక్స్(ట్విట్టర్)లోనూ ఫిర్యాదు చేయాలని హైడ్రా కమిషనర్ కోరారు.

# వేములవాడ మున్సిపల్ లో రెండవ రోజు భారీగా నామినేషన్ల దాఖలు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో రెండవ రోజు నామినేషన్ల సందర్భంగా భారీ ఎత్తున వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. ఇందులో అధికార కాంగ్రెస్ పార్టీ నుండి 28 మంది, బిజెపి పార్టీ నుండి 24 మంది, ప్రధాన ప్రతిపక్ష పార్టీ బి ఆర్ ఎస్ నుండి 21 మంది, ప్రముఖ సినీ నటుడు పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ నుండి 05, భారత కమ్యూనిస్టు పార్టీ నుండి 02, బీఎస్పీ పార్టీ నుండి 01, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా 09, మంది తమ తమ నామినేషన్లను దాఖలు చేశారు. మొత్తంగా చూస్తే గురువారం రోజున వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో 90 మంది తమ తమ నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. బుధవారం మరియు గురువారం రోజులలో వేములవాడ మునిసిపల్ ఎన్నికలలో మొత్తం 106 నామినేషన్లు దాఖలు చేసినట్లు వేములవాడ మున్సిపల్ ఎన్నికల అధికారి తెలిపారు. మునిసిపల్ ఎన్నికలకు శుక్రవారం రోజు నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం ఉందని వేములవాడ మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

# మేడారం మహాజాతర లో ప్రధాన ఘట్టం ఆవిష్కరణ

**సాయింత్రం 6.55 గంటలకు చిలకల గుట్ట నుండి మేడారం బయలుదేరిన సమ్మక్క తల్లి.**

**గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, జిల్లా ఎస్ పి గౌరవ సూచకంగా గాలిలో గన్ పేల్చడం తో బయలు దేరిన అమ్మవారు.**

**రాత్రి -- గంటలకు గద్దె పైకి చేరిన సమ్మక్క తల్లి**

చిలుకలగుట్ట వద్ద కుంకుమ భరణి రూపంలో ఉన్న సమ్మక్క దేవతకు ముందుగా సమ్మక్క ప్రధాన పూజారులు కొక్కెర కృష్ణయ్య, ఇతర పూజారులు ముత్యాల సత్యం, సిద్దబోయిన మునిందర్, సిద్దబోయిన బొక్కన్న, కొమ్ము స్వామి, కొమ్ము జనార్ధన్ ఆద్వర్యం లో చిలుకల గుట్ట పైకి చేరుకొని సమ్మక్క తల్లికి దీపాదుప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు దనసరి అనసూయ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ దివకర టి. ఎస్, జిల్లా ఎస్.పి సుధీర్ రాంనత్ కేకన్ గిరిజిన సంప్రదాయాలతో పూజలు నిర్వహించారు. అనంతరం మూడంచల భద్రత మధ్య గన్ ఫైరింగ్ తో చిలకల గుట్ట లో రాత్రి 6.55 గంటలకు మేడారం కు సమ్మక్క తల్లి బయలు దేరి మేడారం గద్దెల పైకి రాత్రి చేరుకుంది. దీనితో మేడారం మహా జాతర లో ప్రధాన ఘట్టం ఆవిష్కృతం అవ్వడం తో భక్తులు పులకించి పోయారు.

ప్రతి రెండూ సంవత్సరాలకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున నిండు వెన్నెల వెలుగుల్లో సమ్మక్క తల్లి గద్దె పై పూజారులు ప్రతిష్ఠించారు. ఇప్పటికే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు ప్రతిరూపాలు మేడారం గద్దెల పై కొలువు తీరారు. ప్రతి రెండూ సంవత్సరాలకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున నిండు వెన్నెల వెలుగుల్లో సమ్మక్క తల్లి గద్దె పై పూజారులు ప్రతిష్ఠించారు. చిలకల గుట్ట నుంచి ఆలయ ప్రాంగణం వరకు అశేష భక్తజనం సమ్మక్క తల్లికి నీరాజనాలు పలికారు.

# పి ఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ హనుమాజీపేట పాఠశాలలో ఘనంగా మాక్ పార్లమెంటు నిర్వహణ.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రజాస్వామ్య విధానాల గురించి, ప్రజాస్వామ్యంలో చట్టాల రూపకల్పన గురించి, ప్రభుత్వాన్ని చట్టసభలు ఏ విధంగా నియంత్రణ చేస్తాయని ప్రత్యక్షంగా తెలియజేయడం కోసం గురువారం రోజున పిఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ హనుమాజీపేట పాఠశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు చిట్నేని శ్రీకాంత్ రావు తెలిపారు. ప్రజాస్వామ్యం అనేది అత్యుత్తమ ప్రభుత్వ విధానమని ప్రజాస్వామ్య విధానాల గురించి రేపటి భావి భారత పౌరులైన విద్యార్థులకు అవగాహన కల్పించడం, వారిని ప్రత్యక్షంగా భాగస్వాములు కల్పించడం ఈ మాక్ పార్లమెంట్ లో విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలు, విమర్శలకు అధికార పక్షం అంతే దీటుగా సమాధానం చెప్పారు. సోషల్ మీడియా వల్ల విద్యార్థులు తీవ్ర దుష్పరిణామాలు ఎదుర్కొంటున్న 15 సంవత్సరాలలోపు విద్యార్థులకు సోషల్ మీడియాను నిషేధించాలని బిల్లును సభ మోజు వాణి ఓటుతో ఆమోదించింది.



ఈ కార్యక్రమంలో హనుమాజిపేట గ్రామ సర్పంచ్ జంకె మధు, వార్డు సభ్యులు మనోజ్, ఏ ఏ పీసీ చైర్మన్ జంకె లావణ్య, మల్లేశం, చిలుక ప్రభాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వేములవాడలో బి.ఆర్.ఎస్ కు రాజీనామా చేసి బిజెపిలో చేరిన డాక్టర్ నరేష్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** గురువారం రోజున వేములవాడ మున్సిపల్ ఎన్నికలవేళ బిఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. గత కొన్ని సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న డాక్టర్ నరేష్ గురువారం రోజున ఆ పార్టీకి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలు చేరారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సమక్షంలో డాక్టర్ నరేష్ కు బిజెపి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ డాక్టర్ నరేష్ లాంటి విద్యావంతులు, ప్రజలతో మంచి సంబంధాలు కలిగిన నాయకుడు బిజెపి పార్టీలో చేరడం పార్టీకి మరింత ఫలాన్ని చేకూర్చిందని తెలిపారు.

ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బిజెపి పార్టీలో చేరినట్లు తెలిపారు. త్వరలో జరగబోయే వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో అభివృద్ధికి బిజెపి పార్టీ కట్టుబడి ఉందని, వేములవాడ పట్టణ ప్రజలంతా బిజెపి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మున్సిపల్ ఎన్నికలు జరగనున్న తరుణంలో బిఆర్ఎస్ పార్టీ నుంచి కీలక నేతలు పార్టీని వేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, రాష్ట్ర దళిత మోర్చా నాయకుడు కుమ్మరి శంకర్, వేములవాడ మాజీ ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సంటి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# కులగణన విషయంలో మాట తప్పిన బీజేపీ కల్వకుంట్ల కవిత




హైదరాబాద్. దేశ వ్యాప్తంగా జనగణన, కులగణన పై ఎక్సర్ సైజ్ జరుగుతోంది. నిజానికి పదేళ్ల కు ఒకసారి జనగణన చేయాలి. 2021 లో జనగణన చేయాల్సి ఉండే.కానీ కోవిడ్ కారణంగా జనగణన చేయలేదని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.

గురువారం బంజారాహిల్స్ ఖాజా మాన్షన్ లో జరిగిన జాతీయ జన గణనలో కులగణన – సమగ్ర చర్చ రౌండ్ టేబుల్ సమావేశం లో ఆమె మాట్లాడారు.

కవిత మాట్లాడుతూ ఐతే కులగణన పై అన్ని రాష్ట్రాల్లో డిమాండ్ రావటంతో కేంద్రం అందుకు అంగీకరించింది. నిజానికి కులగణన చేయాలన్న బుద్ది బీజేపీ రావటం మమ్మల్ని ఆశ్చర్యపరించింది. జనగణన చేసినప్పుడే ఏ వర్గం ఎంత ఉంది? వారికి బడ్జెట్, ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయన్నది తెలుస్తుంది. కులగణనకు కేంద్రం ముందుకు రావటంతో సంతోషించాం. కానీ ఎప్పుడైతే డాక్యుమెంట్ విడుదల చేశారో అప్పుడే వాళ్ల బుద్ధి బయట పడింది. ఎస్సీ, ఎస్టీ ల కాలం పెట్టారు. ఓబీసీ లేకుండా కులం అనే కాలం మాత్రమే డాక్యుమెంట్ లో పెట్టారు. దీని ద్వారా భారతీయ జనతా పార్టీ...భారత ప్రజలను మోసం చేస్తోందని అన్నారు.కులాల విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా కులాలను పిలుస్తారు. నన్నే తీసుకుంటే నేను వెలమ. తెలంగాణలో ఓసీ, మహారాష్ట్రలో ఎస్సీ, ఏపీ లో బీసీని. చిన్న సంఖ్యలో ఉన్న కులానికే ఇన్ని వైరుధ్యాలు ఉన్నాయి. మరి 56 శాతం ఉన్న బీసీల విషయంలో ఎంత గందరగోళం ఉంటుందో ఆలోచించాలి. గతంలో అగ్రకులాల్లో పేదలకు రిజర్వేషన్లు ఇచ్చారు. వాళ్లు ఏ కేటగిరీలో వస్తారో చెప్పలేదు. ఇవ్వాళ మన రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని కమ్యూనిటీల వాళ్లు వచ్చారు. మనం ఇచ్చే అభిప్రాయం రిజర్వేషన్ల విషయంలో కేంద్రానికి సూచికలా ఉండాలి. బీజేపీ కులగణన విషయంలో ఇచ్చిన మాట తప్పినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అన్ని రాష్ట్రాల్లో ఈ అంశంపై చర్చ జరుగుతోంది. తెలంగాణ నుంచి మన అభిప్రాయం కూడా ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాం. తెలంగాణలో ఉన్న కులాలు, వాటి ఉపకులాల నివేదిక జాగృతి సిద్ధం చేస్తుంది. నిజానికి ఈ పని ప్రభుత్వమే చేయాలి. కానీ వాళ్లకు చిత్తశుద్ధి లేదు. అందుకే మేము అందరినీ ఒపీనియన్స్ తీసుకోవాలని నిర్ణయించాం. తెలంగాణ థింక్స్, ఇండియా ఫాలోస్ నెక్ట్స్ అనే విధంగా మనం ఉంటాం. కులగణన విషయంలోనూ మనం అదే విధంగా నివేదికను కేంద్రానికి ఇద్దాం. ప్రతి కులానికి అన్ని హక్కులు సాధించుకునేలా ప్రయత్నం చేద్దాం. ఇలాంటి అంశంలో రాజకీయ పార్టీల పాత్ర కీలక. కచ్చితంగా ఈ అంశంపై ప్రతి పార్టీకి ఒక స్టాండ్ ఉండాలి. కానీ బీఆర్ఎస్ మాత్రం ఈ విషయంలో ఏమీ మాట్లాడటం లేదు. కాంగ్రెస్ పరిస్థితి అంతే. బీజేపీయే డాక్యుమెంట్ విడుదల చేసింది. కనుక వాళ్లు ఆ డాక్యుమెంట్ గా మద్దతుగా మాట్లాడుతున్నారు. కానీ అన్ని పార్టీలు కూడా తమ స్టాండ్ ఏంటో చెప్పాల్సిందేనని అన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com